# విశాల భారతి

03-06-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 149


## పోయి నీ పని చూసుకో పవన్

### పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

- ఇకపై తెలంగాణ పనుల్లో ఆంధ్రా కాంట్రాక్టర్లకు చోటు లేదు
- రాష్ట్ర పనులు స్థానికులకే దక్కాలన్నది ప్రభుత్వ లక్ష్యం
- తెలంగాణను కించపరిస్తే పవన్ పర్యటనలను అడ్డుకుంటామన్నారు
- ఏపీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పవన్‌కు సూచించారు
- ఏపీ పాలకులను కేంద్రం రెచ్చగొడుతోందని విమర్శించారు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ నేల అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల రాజకీయాలలో పెను మిగతా 2లో..

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ హైదరాబాద్ వేదికగా నిర్వహించిన ప్రెస్ మీట్ ఆయన రాజకీయ అపరిపక్వతను, నిలకడలేని తనాన్ని మరోసారి బయటపెట్టింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలో జనసేన తలపెట్టిన తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభకు పోలీసులు భద్రతా కారణాల దృష్ట్యా అనుమతి నిరాకరించారు. దీనిని ఒక రాజకీయ అస్త్రంగా మార్చుకోవాలని చూసిన పవన్ కల్యాణ్, తన జూబ్లీహిల్స్ నివాసంలోనే అత్యంత ఆవేశంతో కూడిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన ఒక బాధ్యతాయుతమైన ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉండి కూడా, పక్క రాష్ట్ర పోలీసుల నిర్ణయాలను తప్పుబడుతూ మాట్లాడటం ఆయన స్థాయికి తగని పనిగా విమర్శకులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీకి బలం లేకపోయినా కేవలం ప్రచారం కోసమే ఇలాంటి సభలు పెట్టాలని చూస్తున్నారనేది స్పష్టమవుతోంది.



# ఆంధ్రాలో చేతకాదా?

- పవన్ కల్యాణ్ సానుభూతి కోసం ఆవేశం
- డిప్యూటీ సీఎం బాధ్యతలు గాలికి
- పదేళ్ల తర్వాత సెంటిమెంట్ రాజేసే ప్రయత్నం
- హోదా మరిచి పీకలు కోస్తాం అంటూ వ్యాఖ్యలు
- ఆక్రమణలపై 'ఉరి' సెంటిమెంట్ నాటకం

03

ఏపీలోనే దిక్కులేక, ఇక్కడ పోటీ అంటూ పగటికలలు

## మేం పాలకులం కాదు..
# మీ సేవకులం

- పెత్తనం కాదు, సేవ చేసే ప్రజా ప్రభుత్వం
- తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి ధన్యవాదాలు
- గత నియంతృత్వాన్ని ఓడించి ప్రజలు గెలిపించారు
- ఎన్నికల్లో విమర్శలను కాదని ప్రజలు అండగా నిలిచారు
- దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పాలన
- సామాజిక న్యాయం, స్వేచ్ఛే పరమార్థం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కొరకు ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా పరిపాలన సాగుతోందని ఆయన వివరించారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తాము పాలకులం కాదని, ప్రజలకు సేవకులుగా బాధ్యతను నిర్వర్తిస్తున్నామని ఆయన ప్రకటించారు. ప్రతిక్షణం రాష్ట్ర హితమే పరమార్థంగా ముందుకు సాగుతామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిర్ణయాలలో ప్రజా ప్రాధాన్యతలకు ప్రథమ స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. దశాబ్దాల సుదీర్ఘ పోరాటంలో ఎందరో అమరుల త్యాగాల ఫలంగా తెలంగాణ స్వరాష్ట్రం సిద్ధించిందని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. అమరవీరుల తెగువకు, బలిదానాలకు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన శిరస్సు వంచి నమస్కరించారు. కోటి రతనాల వీణ అయిన తెలంగాణ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జూన్ 2 అనేది కేవలం ఒక తేదీ కాదని, అది త్యాగాల చరిత్రను స్మరించుకునే ఒక భావోద్వేగ సందర్భమని అభివర్ణించారు. రేపటి ఉజ్వల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసుకునే అద్భుతమైన రోజుగా దీనిని అభివర్ణించారు. మిగతా 3లో..



## టీజీపీఎస్సీ భారీ నోటిఫికేషన్

- ఆర్ అండ్ బీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో 290 ఖాళీలు
- 18-44 ఏళ్లు 2026 జులై 1 నాటికి
- 222 పోస్టులు, దరఖాస్తులు జూన్ 6 - జులై 13
- 49 పోస్టులు, దరఖాస్తులు జూన్ 8 - జులై 15
- 19 పోస్టులు, దరఖాస్తులు జూన్ 10 - జులై 17
- పూర్తి వివరాలకు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ చూడండి

03



# కవిత భూపోరాటం

- మిలియన్ మార్చ్ తరహాలో పోరాటం
- ఉప్పల్ భగాయత్‌లో భారీ నిరసన
- జయశంకర్ విగ్రహం హైదరాబాద్‌లో ఏర్పాటు
- విగ్రహ స్థాపన ఖర్చులన్నీ మావే
- ఉద్యమకారుల హామీలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

క్యాలెండర్ సెలవు కాదు.. ఆత్మగౌరవం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఉద్యమ చరిత్రలో మైలురాయిగా నిలిచిన మిలియన్ మార్చ్ తరహాలోనే మరో భారీ భూ పోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు టీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని అక్కడ ఏర్పాటు చేసిన సభలో మిగతా 2లో..



# వరుణుడు దెబ్బ కొడతాడా?

- ప్రపంచ ఆర్థిక మందగమనం వేళ దేశాన్ని కాపాడేది వ్యవసాయమే
- ఈ ఏడాది వర్షాలను తగ్గించే ఎల్ నినో ప్రభావం 60శాతం ఉంది
- వర్షాలు లేక సాగు తగ్గితే, నిత్యావసరాల ధరలు 20శాతం పెరుగుతాయి
- కరువు వస్తే గ్రామీణ కొనుగోలు శక్తి పడిపోయి, కంపెనీల లాభాలు తగ్గుతాయి
- పంటలు దెబ్బతింటే బ్యాంకుల మొండి బకాయిలు, ప్రభుత్వ సబ్సిడీల భారం
- ఈ ముప్పును తట్టుకోవాలంటే డ్రిప్ ఇరిగేషన్, జల సంరక్షణ 40శాతం పెరగాలి

03



## పుష్కర తెలంగాణ ముష్కరుల పాలైంది

- తెలంగాణను రేవంత్ సర్వనాశనం చేశాడు
- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలూ మోసపోయాయి
- రైతుబంధు ఎగగొట్టి, పంటలు కొనడం లేదు
- ఉద్యోగాలు ఇవ్వలేదు; రేవంత్‌కు అశోక్ నగర్ సవాల్

04

## అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ



- దేశ వృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలి
- అమరవీరుల పోరాటాల వల్లే స్వరాష్ట్రం సాధ్యమైంది
- మాతృభూమి స్వర్గం కంటే గొప్పదని కొనియాడారు
- చెరువులు, ప్రాజెక్టులతో రైతాంగమే రాష్ట్రానికి జీవనాడి
- అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ గుర్తింపు సాధించింది
- గ్రామాలు, పట్టణాలు, అన్ని వర్గాల సంక్షేమం జరగాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ సమాజం సాధించిన ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని ఈ సందర్భం మనకు గుర్తుచేస్తోంది. అనేక దశాబ్దాల పాటు సాగిన ప్రజాస్వామ్య పోరాటాలు, లెక్కలేనన్ని బలిదానాల పునాదుల పైననే నేటి ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించింది. ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన వివక్షకు వ్యతిరేకంగా లక్షలాది గొంతుకలు ఒక్కటయ్యాయి. స్వయంపాలన నినాదంతో సాగిన ఆ ఉద్యమం మిగతా 2లో..

# పవన్ ఒక పెయిడ్ ఆర్టిస్ట్



- తెలంగాణ ఇక్కడి నాలుగు కోట్ల ప్రజల అందరి అయ్య జాగీరే
- ఆంధ్రా ప్రజలు ఇక్కడ ప్రశాంతంగా ఉన్నారు, పవన్ గొడవలు పెట్టొద్దు
- గద్దర్‌కు కారు కొనిచ్చానని డబ్బా కొట్టుకోవడం అహంకారం
- ఎవరో రాసిచ్చిన చిట్టీల స్క్రిప్ట్ చదువుతూ విషం కక్కుతున్నారు
- తెలంగాణ ఏర్పాటుపై పవన్ పాత రాగం అందుకోవడం కక్షే
- ఆంధ్రాలోనే గెలవలేని వ్యక్తి, సినిమాల్లో ఈలలు చూసి ఊగిపోవద్దు

02

# పోయి నీ పని చూసుకో పవన్

**మొదటిపేజీ తరువాయి**

ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఎంతో కష్టపడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంపై, ఇక్కడి ప్రజల మనోభావాలపై పవన్ చేసిన అనుచిత ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. హైదరాబాద్ గడ్డపై నిలబడి తెలంగాణను కించపరచడం సహించరానిదని, ఇలాంటి మాటల వెనుక ఉన్న దురుద్దేశాలను ప్రజలు గమనిస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి ఫలాలు అందుతూ ప్రజలు సంబరాల్లో ఉన్న వేళ, పక్క రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉండి అనవసరమైన చిచ్చు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ వాడిన భాషపై మంత్రి కోమటిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణపై విషం చిమ్ముతున్న తీరు చూస్తుంటే రక్తం మరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ నోటి నుంచి వచ్చిన మాటలు తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను అవమానించేలా ఉన్నాయని ఆయన మండిపడ్డారు. తెలంగాణ మీ అయ్య జాగీరా అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు సభ్యతకు విరుద్ధమని, అధికారం దక్కగానే అహంకారంతో పక్క రాష్ట్రంపై విరుచుకుపడటం సరికాదని హెచ్చరించారు. అణువణువునా అదే ద్వేషం, అదే వివక్ష ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తోందని, ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం ఆశ్చర్యకరమని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తమకున్న నిబద్ధతను మంత్రి కోమటిరెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తమ మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన చరిత్ర తమదని ఆయన స్పష్టం చేశారు. ఆనాడు ప్రాంత ప్రయోజనాలే ముఖ్యమని భావించి ఆమరణ నిరాహార దీక్షకు దిగిన పోరాటపటిమ తమదన్నారు. అటువంటి త్యాగాల పునాదుల మీద నిలబడిన ఈ రాష్ట్రంపై పవన్ వంటి వారు వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని ఆయన పేర్కొన్నారు. ఇక్కడి ప్రజల భావోద్వేగాలను,




ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే రాష్ట్ర ప్రజలు ఊరుకునేది లేదని ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ నాయకులతో కలిసి తెలంగాణపై మళ్లీ కుట్రలు చేస్తున్నారనే అనుమానం కలుగుతోందని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ, ఇక్కడే వ్యాపారాలు సాగిస్తూ, తెలంగాణ అస్తిత్వాన్ని కించపరచడం ఎవరినీ సహించేది లేదని ఆయన తేల్చిచెప్పారు. ఆరు సార్లు చట్టసభలకు ఎన్నికై సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తిగా పవన్ కల్యాణ్‌కు ఒక సలహా ఇస్తున్నానని, డిప్యూటీ సీఎం హోదాలో ఏపీ అభివృద్ధి పైన దృష్టి సారించడం ఉత్తమమని హితవు పలికారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీ పడాలి తప్ప, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం శ్రేయస్కరం కాదని ఆయన సూచించారు. రాష్ట్రంలోని కాంట్రాక్టుల విషయంలో మంత్రి కోమటిరెడ్డి సంచలన ప్రకటన చేశారు. తెలంగాణలో ఇకపై ఆంధ్రా కాంట్రాక్టర్లకు ఒక్క ప్రాజెక్టు కూడా ఇవ్వబోమని ఆయన స్పష్టం చేశారు. దీనికోసం అవసరమైతే కఠినమైన చట్టాన్ని తీసుకురావడానికైనా ప్రభుత్వం వెనుకాడదని ఆయన ప్రకటించారు. తెలంగాణ కోసం ఎంతకైనా తెగిస్తామని, బరిగీసి నిలబడతామని ఆయన తేల్చిచెప్పారు. స్థానికతను, ఇక్కడి నిరుద్యోగుల అవకాశాలను దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని స్థానిక కాంట్రాక్టర్లకు, నిరుద్యోగులకు మేలు చేసేలా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. పవన్ కల్యాణ్ తన సహనాన్ని పరీక్షించవద్దని, తర్వాత జరిగే పరిణామాలకు బాధ్యత పవన్ కల్యాణే వహించాల్సి ఉంటుందని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిని ఓర్వలేకనే ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని, ఇవి ప్రజల్లో విద్వేషాలను పెంచుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొత్తలో సంయమనంతో ఉండాల్సిన పవన్, రాజకీయ పబ్బం గడుపుకోవడానికి తెలంగాణపై నోరు పారేసుకోవడం చూస్తుంటే బాధగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే అది ఎవరివల్లా సాధ్యం కాదని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, మౌలిక వసతుల కల్పనలో వేగవంతమైన ప్రగతిని సాధిస్తున్నామని, ఇలాంటి సమయంలో వివాదాలతో ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని, కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపిస్తున్నారని ఆయన చెప్పారు. పక్క రాష్ట్ర నాయకులు ఇక్కడి శాంతిభద్రతలను, అభివృద్ధిని చూసి నేర్చుకోవాలి తప్ప, ప్రాంతీయ చిచ్చు పెట్టడం సమర్థనీయం కాదని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమే అయినప్పటికీ, ప్రాంతాల మధ్య గొడవలు పెట్టేలా వ్యాఖ్యలు ఉండకూడదని మంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణ కోసం ఎందరో త్యాగధనులు పోరాడారని, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తోందని ఆయన అన్నారు. పవన్ కల్యాణ్ అజ్ఞానంతో మాట్లాడుతున్నారో లేదా రాజకీయ ప్రయోజనాల కోసం కావాలని మాట్లాడుతున్నారో స్పష్టం చేసుకోవాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌లో వ్యాపారం చేసుకునే వారికి, ఇక్కడ నివసించే వారికి తాము ఎప్పుడూ రక్షణగా ఉంటామని, కానీ తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచే వారిని మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టేలా ఎటువంటి ఒప్పందాలు లేవని, ఎవరు ఏమన్నా రాష్ట్రం తన ప్రస్థానాన్ని కొనసాగిస్తుందని కోమటిరెడ్డి పునరుద్ఘాటించారు. పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఏ పదవిలో ఉన్నా మాటల పట్ల బాధ్యత ఉండాలని, ముఖ్యంగా తెలుగు ప్రజల మధ్య విద్వేషాలను పెంచే పనులు ఎవరూ చేయకూడదని ఆయన సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందని, వివాదాలకు తావు లేకుండా పనిచేయడంపైనే తమ ప్రభుత్వం దృష్టి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ వివాదాస్పద వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. పవన్ కల్యాణ్ కామెంట్స్‌కు నిరసనగా పలు చోట్ల నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నాయని సమాచారం. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ఈ సంచలన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఆంధ్రప్రదేశ్ నాయకులు తెలంగాణ ఆత్మగౌరవాన్ని గుర్తించాలని, ఇలాంటి వ్యాఖ్యలతో ఇరు రాష్ట్రాల మధ్య సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రా కాంట్రాక్టర్ల విషయంలో తీసుకున్న నిర్ణయం ఎలా అమలు అవుతుందనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.


## ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- నివాళులర్పించి జెండా ఆవిష్కరించిన మెచ్చా నాగేశ్వరరావు
- అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి
- జాతీయ, పార్టీ జెండాల ఆవిష్కరణతో వేడుకలు
- కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు









**అశ్వారావుపేట, విశాలభారతి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట మండల కేంద్రంలో మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు హాజరయ్యారు.ముందుగా తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జాతీయ జెండా, పార్టీ జెండాలను ఆవిష్కరించి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు దొడ్డ రమేష్, పార్కలగండి సర్పంచ్ కొమరం సుశీల, నాచారం సర్పంచ్ కువ్వారపు శ్యామల, దారా యుగంధర్, జలగం వాసు, దేవరపల్లి అజయ్ కుమార్, తుమ్మల లక్ష్మణ్‌రావు, చీకటి రామయ్య, యలమంచి చంద్రశేఖర్‌రావు, ఆళ్ల జంగం, వార్డు సభ్యులు దారా రాము, ఉయ్యాల లక్ష్మీనారాయణ, రూపా రాంబాబు, రామభద్రం, బుడే, అబ్దుల్ జిన్నా, మండల మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావూరి వీరయ్య, మాజీ యూత్ నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, మాజీ మండల యూత్ అధ్యక్షుడు మండవ సత్యనారాయణ, బెక్కం వెంకటేశ్వరరావు, కూకలకుంట రవి, ఉద్యమ నాయకులు గాజుబోయిన శ్రీను (ఆటో), వల్లేపు నాగేశ్వరరావు, పెద్దగొల్లగూడెం ఉప సర్పంచ్ రామకృష్ణ, ఎస్సీ సెల్ నాయకులు మద్దెల పుల్లారావు, శ్రీరాముల చక్రధర్‌రావు, పాశ్యం ప్రసాద్, రెడ్డిమల్ల నాగయ్య, కోర్స వెంకటేశ్వరరావు, వెలుగోటి మహేష్, అడపా నాయుడు, మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను, మండల బీసీ నాయకులు తాళ్ల వెంకటేశ్వరరావు, బండి ప్రసాద్, పందు, కార్తీక్, సాయి, పుల్లయ్య, గుత్తి శ్రీనివాసరావు, దేరంగుల కృష్ణ, రవి, కొండపల్లి చెన్నారావు, పాగి ముక్తేశ్వరరావు, మిడత లక్ష్మీనారాయణ, పోలరాజు, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

భారత చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. శాంతియుత మార్గంలో సాగిన ఆ సుదీర్ఘ ప్రయాణంలో విద్యార్థులు, యువకులు, కార్మికులు, రైతులు తమ వంతు పాత్రను పోషించారు. స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవాలనే ఆకాంక్ష ప్రతి ఒక్కరిలో బలంగా నాటుకుపోవడం వల్లే స్వరాష్ట్ర స్వప్నం సాకారమైంది. ఆయా పోరాటాల ఫలితంగానే నేడు మనకు స్వయంపాలన భాగ్యం లభించింది. రాష్ట్ర అవతరణ దినోత్సవం అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది అమరవీరుల త్యాగాలే. ప్రత్యేక రాష్ట్రం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అర్పించిన మహానుభావులకు సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది. వారి వీరోచిత పోరాటాలను, త్యాగాలను స్మరించుకుంటూ ప్రతిటా వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడం ఒక సంప్రదాయంగా మారింది. ఈ ప్రత్యేక దినాన ప్రభుత్వ అధికారిక నివాసాల్లో, ముఖ్య కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పిస్తారు. ఈ ఉత్సవాలు కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల హృదయాలను తాకుతాయి. భౌగోళిక సరిహద్దులు దాటి విదేశాల్లో నివసిస్తున్న వారు కూడా తమ మాతృభూమి సంబరాలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. ప్రతి మనిషికి తన జన్మభూమి అనేది స్వర్గం కంటే మిన్న అయినదిగా భావిస్తారు. మన సంస్కృతిలో పుట్టిన గడ్డకు ఇచ్చే గౌరవం ఎంతో విశిష్టమైనది. ఆధునిక కాలంలో తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదులు వేసిన ప్రతి ఒక్కరినీ స్మరించుకోవడం మన కనీస బాధ్యత. నాటి తరం నాయకులు చూపిన బాటలో నడుస్తూ నేటి తరం ఈ ప్రాంత అభివృద్ధికి కంకణం కట్టుకుంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ అన్ని వర్గాల ప్రజలు ఇక్కడ సోదరభావంతో జీవిస్తున్నారు. గతాన్ని గౌరవిస్తూనే భవిష్యత్తు వైపు అడుగులు వేయడమే నిజమైన దేశభక్తిగా మారుతుంది. ఈ సద్భావన ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తూ సమాజ ఎదుగుదలకు దోహదపడుతోంది. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఈ ప్రాంతానికి అసలైన జీవనాడిగా నిలిచాయి. శతాబ్దాల నాటి చరిత్ర కలిగిన ఈ నేలపై ఎన్నో కళలు, పండుగలు రూపుదిద్దుకున్నాయి. ఇక్కడి గ్రామీణ జీవనం, జానపద కళలు మానవ సంబంధాలను ప్రతిబింబిస్తాయి. ప్రతి పల్లెటూరు ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక కేంద్రంగా వెలుగుతోంది. ప్రజల ఆచార వ్యవహారాలు, భాషా శైలి ఎంతో మృదువుగా, ఆత్మీయంగా ఉంటాయి. కాలం మారుతున్నప్పటికీ ఈ



విలువలు ఏమాత్రం చెరిగిపోకుండా తరతరాలకు అందుతున్నాయి. ఈ వైవిధ్యమే మనకు ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇక్కడి పండుగలు ప్రకృతిని ఆరాధించేవిగా ఉండటం విశేషం. వ్యవసాయ రంగంలో ఈ ప్రాంతానికి ఒక ఘనమైన చరిత్ర ఉంది. కాకతీయుల పరిపాలన కాలం నాటి గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ ఒక అద్భుతమైన సాంకేతికతకు నిదర్శనంగా నిలుస్తుంది. నాడు నిర్మించిన వేలాది చెరువులు నేటికీ భూగర్భ జలాలను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రాచీన కాలం నుండి రైతాంగం అనుసరిస్తున్న సాంప్రదాయ పద్ధతులు భూమిని సస్యశ్యామలం చేశాయి. వర్షపు నీటిని నిల్వ చేస్తూ పంటలను పండించడంలో ఇక్కడి రైతుల నైపుణ్యం ప్రశంసనీయం. ఆనాటి నీటి యాజమాన్య పద్ధతులు ఆధునిక శాస్త్రవేత్తలను సైతం ఆశ్చర్యపరుస్తాయి. ఈ వారసత్వమే మన వ్యవసాయ రంగానికి బలమైన పునాదిగా నిలిచింది. కాలక్రమేణా సాంకేతికత పెరగడంతో సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. భారీ నదుల పైన నిర్మించిన ఆధునిక ప్రాజెక్టులు లక్షలాది ఎకరాలకు నీటిని అందిస్తున్నాయి. భూగర్భ జలాల పైన ఆధారపడటం తగ్గిస్తూ కాల్వల ద్వారా నీటి సరఫరా పెరిగింది. ప్రభుత్వం చేపట్టిన వివిధ నీటి పారుదల పథకాలు పొలాలను పచ్చదనంతో నింపుతున్నాయి. ఎండిపోయిన భూములు సైతం నేడు మూడు పంటలతో విరాజిల్లుతున్నాయి. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ఇది ఎంతో ఊతాన్ని ఇచ్చింది. రైతుల శ్రమకు తగిన ఫలితం దక్కడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎంతో బలోపేతం అవుతోంది. కేవలం వ్యవసాయానికే పరిమితం కాకుండా పారిశ్రామిక రంగంలోనూ అద్భుతమైన పురోగతి కనిపిస్తోంది. ముఖ్యంగా సమాచార సాంకేతిక పరిజ్ఞానం, ఐటీ రంగంలో ఈ ప్రాంతం ప్రపంచ పటంలో నిలిచింది. అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు ఇక్కడ తమ కార్యాలయాలను స్థాపించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. దీనివల్ల వేలాది మంది యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వీలుగా స్టార్టప్ వ్యవస్థ ఎంతో బలంగా తయారైంది. ప్రతిభ గల యువతకు అవసరమైన వనరులను కల్పిస్తూ నూతన పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం అవుతోంది. ఈ మార్పు ఆర్థిక వ్యవస్థను పరుగులు తీయిస్తోంది. ఔషధ రంగంలో సైతం ఈ ప్రాంతం ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా ఎదుగుతోంది. ఫార్మా రంగానికి సంబంధించిన పరిశోధనలు, మందుల ఉత్పత్తి ఇక్కడ భారీ ఎత్తున జరుగుతున్నాయి. వివిధ దేశాలకు అవసరమైన జీవరక్షక ఔషధాలను ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నారు. ఇది నగరాల ఆర్థిక స్థితిగతులను పూర్తిగా మార్చేసింది. పరిశ్రమల స్థాపన వల్ల స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయి. పారిశ్రామిక అభివృద్ధి పర్యావరణ పరిరక్షణతో కూడి ఉండటం ఎంతో ముఖ్యం. సమతుల్యమైన ప్రణాళికలతో ముందుకు సాగడం వల్ల సుస్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. సమాజంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం. గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి సమాన నిష్పత్తిలో సాగినప్పుడే సమగ్ర వికాసం సాధ్యమవుతుంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన వల్ల వలసలు తగ్గుముఖం పడతాయి. నగరాల ఆధునికీకరణలో భాగంగా రవాణా సౌకర్యాలు, తాగునీరు, పారిశుధ్యం మెరుగుపడుతున్నాయి. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక అసమానతలను తొలగించవచ్చు. బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న పథకాలు వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. ఈ సర్వాంగీణ వికాసమే ఒక ఆదర్శ రాష్ట్రానికి చిహ్నంగా మారుతుంది. దేశ ప్రగతిలో ఈ ప్రాంతం ఒక చోదక శక్తిగా వ్యవహరిస్తోంది. జాతీయ ఆదాయానికి తన వంతు సహకారాన్ని అందిస్తూ అగ్రగామిగా నిలుస్తోంది. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడి పాలన సాగించడం వల్ల వ్యవస్థలపై నమ్మకం పెరుగుతుంది. అందరూ సుఖంగా ఉండాలనే పురాతన భారతీయ ఆదర్శం ఇక్కడ అక్షరాలా ప్రతిబింబిస్తోంది.

# కవిత భూపోరాటం

**మొదటిపేజీ తరువాయి**

ఆమె మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం సాగిన సుదీర్ఘ పోరాటాన్ని, అమరవీరుల త్యాగాలను లోతుగా గుర్తుచేసుకున్నారు. ఉద్యమకారులు ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలను, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యాచరణను ఆమె ఈ వేదిక ద్వారా ప్రజల ముందుకు తీసుకువచ్చారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలకు తెలంగాణ సమాజం ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటుందని ఆమె ఈ సందర్భంగా ప్రకటించారు. తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని దేశ స్వాతంత్ర పోరాటంతో పోల్చిన ఆమె, ఆనాటి ఉద్యమకారుల నిబద్ధతను ఎంతో కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన క్రమంలో ఎంతోమంది తమ సొంత ఆస్తులను, విలువైన ఉద్యోగాలను సైతం త్యాగం చేశారని గుర్తుచేశారు. అటువంటి కష్టకాలంలోనూ వెనకడుగు వేయకుండా పోరాటాన్ని సజీవంగా ఉంచిన ప్రతి ఒక్క ఉద్యమకారుడికి ఆమె శిరస్సు వంచి నమస్కరించారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని ఆమె మండిపడ్డారు. ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడం తీవ్ర విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటలను పక్కనబెట్టి కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదని, తక్షణమే ప్రభుత్వం దీనిపై స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత పునాదులు వేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని కవిత ఉద్ఘాటించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర గుండెకాయ లాంటి ప్రాంతంలో ఆయన విగ్రహాన్ని తప్పనిసరిగా ప్రతిష్టించాలని ఆమె కోరారు. జయశంకర్ సార్ ఆశయాలు, ఆయన చేసిన ప్రసంగాలు తెలంగాణ సమాజాన్ని ఏ విధంగా మేల్కొలిపాయో ఆమె వివరించారు. రాష్ట్రం సిద్ధించి ఇన్నేళ్లు గడుస్తున్నా ఆయనకు దక్కాల్సిన గౌరవం దక్కకపోవడం అన్యాయమని వాపోయారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఒక గొప్ప మేధావి విగ్రహ ఏర్పాటులో ఇంత జాప్యం జరగడం వెనుక ఉన్న నిర్లక్ష్యాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ఈ విగ్రహ ఏర్పాటు కోసం గతంలో తాము చేసిన ప్రయత్నాలను ఆమె సభలో కూలంకషంగా వివరించారు. రెండు వేల పద్నాలుగు (2014) సంవత్సరం నుంచే ఈ విషయమై నిరంతర ప్రయత్నాలు సాగుతున్నాయని ఆమె గుర్తుచేశారు. రెండు వేల పదిహేడు (2017) వ సంవత్సరంలో అప్పటి మున్సిపల్ శాఖకు అధికారికంగా లేఖ రాసి



నప్పటికీ ఆశించిన స్పందన రాలేదని ఆరోపించారు. ఒక మహనీయుడి విగ్రహం కోసం ఇన్నేళ్లుగా ఎదురుచూడాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తాజాగా మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాస్తూ విగ్రహ ఏర్పాటు ప్రాధాన్యతను వివరించినట్లు కవిత వెల్లడించారు. ఈ విగ్రహ స్థాపనకు అయ్యే పూర్తి ఖర్చును, ఆ తర్వాత దాని నిర్వహణ బాధ్యతలను తామే స్వయంగా చూసుకుంటామని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. రాబోయే ఆగస్టు ఆరవ (6) తేదీన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉన్నందున, ఆ లోపే విగ్రహ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె గడువు విధించారు. మున్సిపల్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ విషయాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అధికారులు తక్షణమే ఫైళ్లను కదిలించి ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జూన్ రెండవ (2) తేదీన జరుపుకునే ఆవిర్భావ దినోత్సవం అనేది కేవలం క్యాలెండర్‌లో ఒక ప్రభుత్వ సెలవు దినం మాత్రమే కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, సొంత గుర్తింపునకు, భాషా స్వేచ్ఛకు ప్రతీకగా నిలిచే ఒక చారిత్రాత్మక రోజని కొనియాడారు. తెలంగాణ పోరాట మహోజ్వల చరిత్రను ప్రస్తుత యువతకు, రాబోయే కొత్త తరాలకు విస్తృతంగా చేరవేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని కవిత పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వ వైఖరిపై ఆమె తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. జూన్ రెండు (2) నాటి అధికారిక వేడుకల్లో ఉద్యమకారుల దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అందరూ ఆశించారని తెలిపారు. ప్రభుత్వం ఆ వేదికలపై నుంచి ఎలాంటి సానుకూల ప్రకటనలు చేయకపోవడం ఉద్యమకారులను తీవ్ర నిరాశకు గురిచేసిందని అన్నారు. ప్రభుత్వ ఈ ఉదాసీన వైఖరికి నిరసనగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున భూపోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఇందులో భాగంగానే జూలై రెండవ (2) తేదీన ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో ఒక భారీ భూపోరాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఏ ఒక్క పార్టీకో లేదా వర్గానికో పరిమితం చేయడం లేదని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని మేధావులు, ఉద్యోగ సంఘాల నాయకులు, విద్యార్థి లోకం, న్యాయవాదులు, మీడియా ప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణను ప్రేమించే ప్రతి ఒక్క పౌరుడు ఈ పోరాటంలో భాగస్వామి కావాలని కోరారు. ఉప్పల్ భగాయత్ వేదికగా సాగే ఈ ప్రదర్శన ప్రభుత్వ కళ్ళు తెరిపించేలా ఉంటుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని కవిత స్పష్టం చేశారు. అమరవీరుల త్యాగాలను గౌరవించడం, వారి కుటుంబాలను ఆదుకోవడం సమాజ ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యమకారులందరినీ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ప్రక్రియలో కీలక భాగస్వాములను చేస్తామని హామీ ఇచ్చారు. స్వరాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన హస్తాలు నేడు నిర్లక్ష్యానికి గురికావడం భావ్యం కాదని అన్నారు. హక్కుల సాధన కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని ఆమె ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఉద్యమ కాలం నాటి ఉత్సాహాన్ని, పట్టుదలను మరోసారి ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందని కవిత కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అధికారంలో ఉన్నవారు ప్రజల ఆకాంక్షలను మరిచిపోతే ఎలా బుద్ధి చెప్పాలో తెలంగాణ సమాజానికి బాగా తెలుసని అన్నారు. భూపోరాటం ద్వారా ఉపాధి కోల్పోయిన పేదలకు, ఇళ్లు లేని అర్హులకు న్యాయం జరిగేలా ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. జూలై రెండు (2) నాటి ఉప్పల్ భగాయత్ సభ ఈ నూతన పోరాటానికి ఒక బలమైన పునాది కాబోతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వాలు మారినా ప్రజల ఆశయాలు, ఉద్యమకారుల ఆకాంక్షలు మారవని గుర్తుచేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో జూలై నుండి ప్రారంభమయ్యే ప్రజా ఆందోళనలు రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం అవుతాయని కవిత హెచ్చరించారు.

# పవన్ ఒక పెయిడ్ ఆర్టిస్ట్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ సమాజంపై, ఇక్కడి సంస్కృతిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. హైదరాబాదులో ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఆయన పవన్ కల్యాణ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఎవరిదో కాదని, ఇక్కడి నాలుగు కోట్ల ప్రజల సొత్తని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ మా అయ్య జాగీరేనని, తెలంగాణ ప్రజల అందరి అయ్య జాగీరేనని ఆయన వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ తన అహంకారాన్ని పక్కన పెట్టి మాట్లాడాలని హితవు పలికారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రత్యేక రాష్ట్రం అనేది ఇక్కడి ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అని, దానిని అవమానించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే ప్రజలకు, వ్యాపారవేత్తలకు తెలంగాణ ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతుందని మంత్రి గుర్తుచేశారు. గత పన్నెండు సంవత్సరాలుగా ఇక్కడ స్థిరపడిన ఆంధ్రా ప్రజలను ఎవరూ ఏమీ అనలేదని చెప్పారు. ఇక్కడ అందరూ ప్రశాంతంగా జీవిస్తున్నారని, వ్యాపారాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ మాత్రం ఏదో ఇక్కడ వివక్ష ఉన్నట్లుగా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఇది భారతదేశమా లేక పాకిస్తానా అంటూ మాట్లాడటం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు.



ఇక్కడికి రావడానికి పాస్‌పోర్ట్ కావాలా అంటూ మాట్లాడటం ద్వారా పవన్ కల్యాణ్ ప్రాంతీయ ద్వేషాన్ని రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం భారత రాజ్యాంగబద్ధంగా ఏర్పడిందని, ఇక్కడ అందరికీ సమాన హక్కులు ఉన్నాయని గుర్తు చేశారు. పవన్ కల్యాణ్ తెలంగాణ ఉద్యమకారులను, కళాకారులను అవమానించేలా మాట్లాడటం దురదృష్టకరమని పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌కు కారు కొనిచ్చానని పవన్ కల్యాణ్ చెప్పుకోవడం ఆయన అహంకారానికి పరాకాష్ట అని విమర్శించారు. చనిపోయిన వ్యక్తి గురించి, అదీ ఒక గొప్ప ప్రజాస్వామిక వాది గురించి ఇలాంటి చులకన వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. గద్దర్ తెలంగాణ ఉద్యమంలో ఒక భావజ్వాలగా నిలిచారని, ఆయన సేవలను ఇక్కడి సమాజం ఎప్పటికీ మరచిపోదని చెప్పారు. అటువంటి మహనీయుడిని తాము ఎంతో గౌరవించుకుంటుంటే, పవన్ కల్యాణ్ మాత్రం తాను ఏదో సహాయం చేశానని డబ్బా కొట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ చేసిన ఈ వ్యాఖ్యలపై తెలంగాణలోని దళిత వర్గాలు, మేధావులు ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. చనిపోయిన గద్దర్ ఆత్మకు శాంతి చేకూరేలా పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాము గతంలో ఏ ఆధిపత్య పోరాటానికి వ్యతిరేకంగా అయితే నిలబడ్డామో, అదే దురహంకారాన్ని పవన్ కల్యాణ్ ఇప్పుడు ప్రదర్శిస్తున్నారని మంత్రి ఆరోపించారు. పవన్ కల్యాణ్ ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడుతుంటే పక్క నుంచి ఎవరో చిట్టీలు పంపుతున్నారని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ ఒక పెయిడ్ ఆర్టిస్ట్ లాగా వ్యవహరిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేపు పొద్దున తన వద్ద కూడా బాగా డబ్బులు ఉంటే ఇలాంటి వారిని పెట్టి మాట్లాడించవచ్చని వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్‌కు ఆ చిట్టీలు బీజేపీ నుంచి వస్తున్నాయా లేక బీఆర్ఎస్ నుంచి వస్తున్నాయా అనేది ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదువుతూ తెలంగాణ సమాజంపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ ఒక రాజకీయ నాయకుడిగా కంటే ఒక నటుడిగానే ఎక్కువగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన తీరుపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తప్పుపట్టారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలోనే తెలంగాణ బిల్లు పాస్ అయిందని, దానికి తానే ప్రత్యక్ష సాక్షినని చెప్పారు. తలుపులు మూసి బిల్లు పాస్ చేశారంటూ పవన్ కల్యాణ్ ఇప్పటికీ పాత రాగాన్ని అందుకోవడం ఆయన కక్ష్యను చూపిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై పవన్ కల్యాణ్‌కు అంత కడుపు మంట ఎందుకో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ ప్రస్తుతం శాసనసభలో ఉన్నారని, బహుశా ఆయనకు పార్లమెంట్ నిబంధనలు తెలిసి ఉండకపోవచ్చని ఎద్దేవా చేశారు. ఎన్నో బలిదానాలు, త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని కించపరిచేలా మాట్లాడటం పవన్ కల్యాణ్ మైండ్‌సెట్‌ను తెలియజేస్తోందని, ఆయన వెంటనే తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ సామరస్య పూర్వక వాతావరణాన్ని కోరుకుంటుందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూర్చుని విభజన సమస్యలను పరిష్కరించుకోవాలని చూస్తున్నారని చెప్పారు.

# పుష్కర తెలంగాణ ముష్కరుల పాలైంది

- తెలంగాణను రేవంత్ సర్వనాశనం చేశాడు
- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలూ మోసపోయాయి
- రైతుబంధు ఎగగొట్టి, పంటలు కొనడం లేదు
- ఉద్యోగాలు ఇవ్వలేదు; రేవంత్‌కు అశోక్ నగర్ సవాల్
- నాలుగు లక్షల కోట్ల అప్పు చేసి రాహుల్‌కు నిధులు
- రాష్ట్రంలో శాంతి లేదు; 2028లో కేసీఆరే సీఎం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సకల జనులు ఎన్నో ఉద్యమాలు, బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పుష్కర కాలంలో ముష్కరుల పాలు చేశారని ఆయన ఆరోపించారు. మోసపూరితమైన హామీలతో అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ప్రగతి పథంలో పయనిస్తున్న తెలంగాణను ఒక్కసారిగా 25 ఏళ్ల వెనక్కి నెట్టేసిందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఎంతో అద్భుతంగా వడ్డించిన విస్తరిలా ఉన్న రాష్ట్రాన్ని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుక్కలు చింపిన విస్తరిలా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి కిరీటాన్ని, ఆమె ధరించిన వడ్డాణాన్ని కాంగ్రెస్ నాయకులు దొంగతనం చేసుకొని పోతున్నారంటూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి ఇప్పటికే సగం సమయం అయిపోయినప్పటికీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం చేసింది ఏమీ లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. కేవలం 30 నెలల కాలంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా కుప్పకూల్చిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సాగించిన ఈ పరిపాలనలో మోసపోని వర్గం అంటూ ఏదీ లేదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం మొత్తం ఇప్పుడు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తున్న ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పోవాలని, మళ్లీ కేసీఆర్ పాలన రావాలని గట్టిగా కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్ర రక్షణ కోసం ఈరోజు మరో ప్రజా పోరాటానికి, తెలంగాణ హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యమ నాయకుడే తెలంగాణ ఉజ్వల ప్రస్థానానికి, అభివృద్ధికి సరైన వ్యక్తని భావించి కేసీఆర్ చేతికి ఇదే రోజున తెలంగాణ ప్రజలు పరిపాలనా బాధ్యతలు అప్పచెప్పారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిన తెలంగాణ పోరాట ఆశయాలనే పునాదిగా చేసుకుని పదేళ్లపాటు అద్భుతమైన, ప్రగతిశీల పాలన అందించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని, తిరిగి డిసెంబర్ 2028 కాలంలో కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని తెలంగాణ ప్రజలే స్వయంగా చెబుతున్నారని ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం మళ్లీ రావాలంటే కేసీఆర్ నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరమని ప్రజలు భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ సాగిస్తున్న అనాలోచిత పాలన వల్ల రాష్ట్రంలో వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో పడిపోయిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతుబంధు పథకం నిలిచిపోయిందని, రైతులకు సమయానికి ఎరువులు ఇచ్చేటోళ్ళు లేకుండా పోయారని విమర్శించారు. చివరికి రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను రెండు నెలలైనా కొనుగోలు చేసే దిక్కు లేకుండా పోయిందని మండిపడ్డారు. అన్నదాతలు ప్రభుత్వం కాళ్ళు పట్టుకున్నా కనీసం కనికరించని దౌర్భాగ్య స్థితిని చూస్తుంటే గుండె విసిగిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే పెట్టుబడిదారులకు ఎంతో ఆదర్శవంతమైన, సురక్షితమైన స్వర్గధామంగా ఉన్న తెలంగాణలో ఈరోజు పారిశ్రామికవేత్తల తలకు తుపాకులు పెట్టి బెదిరించే పరిస్థితులు వచ్చాయని ఆరోపించారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఎలాగైనా బద్నామ్ చేయాలన్న ఒకే ఒక్క కుత్సిత ఉద్దేశంతో సాగునీటి ప్రాజెక్టుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టిందని విమర్శించారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా, గోదావరి నదీ జలాలను తన గురువు చంద్రబాబు నాయుడికి సంతర్పణ చేసే కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి ముమ్మరంగా చేస్తున్నాడని ఆరోపించారు. రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయాన్ని నాలుగు సార్లు ఎగగొట్టిన నయవంచకుడు రేవంత్ రెడ్డి అని దుయ్యబట్టారు. రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో ఇవ్వని చేతగాని అసమర్థ ముఖ్యమంత్రి అని, పంటలు కొనలేని సన్నాసి రేవంత్ రెడ్డి అని తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఈ దుర్మార్గపు చర్యల వల్ల 70 లక్షల తెలంగాణ రైతన్నలు రేవంత్ రెడ్డిని అడ్డగోలుగా తిడుతున్నారని పేర్కొన్నారు. అశోక్ నగర్‌లో నిరుద్యోగ విద్యార్థులను, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువకులను కూర్చోబెట్టి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పెద్ద మోసం చేశాడని కేటీఆర్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 4000 కొత్త ఉద్యోగాలు కూడా నిరుద్యోగులకు ఇవ్వలేకపోయిందని ఆరోపించారు. ఢిల్లీలో కూర్చున్న సన్నాసి రాహుల్ గాంధీ అసలు ఏం చేస్తున్నాడని, చేసిన మోసాలకు తెలంగాణకు రావడానికి మొహం చెల్లడం లేదా అని ప్రశ్నించారు. దమ్ముంటే నిరుద్యోగులు ఉండే చిక్కడపల్లి లైబ్రరీకి, అశోక్ నగర్ చౌరస్తాకు ఒంటరిగా వస్తావా రేవంత్ రెడ్డి అంటూ సవాల్ విసిరారు. చుట్టూ పోలీసులు లేకుండా నిరుద్యోగ యువతను నేరుగా కలుసుకునే ధైర్యం ఉందా అని అడిగారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల ఈరోజు తెలంగాణ రాష్ట్రం మొత్తం ఒక పెద్ద ధర్నా చౌక్‌లా మారిపోయిందని కేటీఆర్ విమర్శించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రజావ్యతిరేక ప్రభుత్వంపైన పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నారని తెలిపారు. దేశానికి వెన్నెముక అయిన అన్నదాతలు, భవిష్యత్తు లేని నిరుద్యోగ యువకులు, ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత రిటైర్డ్ ఉద్యోగులు ఇలా అందరూ ప్రభుత్వం పైన తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పుకొచ్చారు. సమస్యలు పరిష్కారం కాక వారంతా ఎక్కడికక్కడ రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని వివరించారు. రాష్ట్రంలో ప్రజలకు కనీస శాంతి లేదు, ప్రాణాలకు భద్రత లేదని, పట్టపగలే దారుణంగా హత్యలు జరుగుతున్నాయని, గనుల తవ్వకాల పేరుతో భారీ దోపిడీలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలకు కనీసం ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా, కొత్తగా ఒక్క కాలువ కానీ, సాగునీటి ప్రాజెక్టు కానీ నిర్మించకుండా, వృద్ధులకు కొత్త పెన్షన్ ఇవ్వకుండా రేవంత్ రెడ్డి ఏకంగా నాలుగు లక్షల కోట్ల రూపాయల భారీ అప్పును చేశాడని కేటీఆర్ ఆరోపించారు. ఈ అప్పుల వల్ల తెలంగాణ ప్రజలకు ఒక్క రూపాయి కూడా దక్కడం లేదు కానీ ఢిల్లీలో ఉన్న రాహుల్ గాంధీ అకౌంట్లో మాత్రం టింగు టింగుమని నిధులు పడుతున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సంపదను దోచుకుని ఢిల్లీ పెద్దలకు మూటలు పంపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న ఈ దోపిడీని, అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, అందుకే ఇప్పుడు తెలంగాణ ముక్తకంఠంతో కాంగ్రెస్ పోవాలి, కేసీఆర్ రావాలి అని నినదిస్తున్నదన్నారు. మన ప్రయాణం, మన పోరాటం కేవలం అధికారం కోసం కాదని, ఈ పోరాటం నిఖార్సయిన తెలంగాణ ఆత్మగౌరవం కోసమని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎంతో మంది త్యాగాలతో, ఎంతో కష్టపడి సాధించుకున్న తెలంగాణను కాపాడుకోవడం కోసమే మన పోరాటం నిరంతరం కొనసాగుతుందని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అక్రమాలను, ప్రజలను వంచిస్తున్న తీరును ఎండగట్టడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో తెలంగాణను మళ్లీ ప్రగతి పథంలోకి తీసుకురావడానికి, కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతామని పునరుద్ఘాటించారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మునుగోడు, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మునుగోడు మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మందుల సత్యం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ జెండాను మరియు పార్టీ జెండాను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు మదనబోయిన పరమేష్, శరత్ బాబు,నల్గొండ అంజి, వేణుగోపాల్ రెడ్డి, సురేందర్, యాదయ్య,సింగం సైదులు, లోకేష్, దోటి కరుణాకర్,శంకర్,వెంకన్న, బండారు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, రవి,మల్లేష్,సాగర్ రెడ్డి,లింగస్వామి, లింగస్వామి, , శేఖర్, బీసం నర్సింహసర్పంచ్ లు నన్నూరిభూపతి రెడ్డి, జంగిలి సాంబయ్య, ఉపసర్పంచ్‌లు ముంత మారేష్, జిట్టగోని మల్లేష్, గడగోటి రాంబాబు, అలాగే గ్రామ శాఖలు మండల నాయకులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## పెద్దతండలో గుగులోత్ భోజ్యానాయక్‌కు ఘన నివాళులు

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శ
- కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపిన బీఆర్ఎస్ నేతలు



**కురవి విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని పెద్దతండ గ్రామానికి చెందిన గుగులోత్ భోజ్యానాయక్ మరణించడంతో నేడు వారి భౌతికకాయానికి మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా భోజ్యానాయక్ సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గ్రామ ప్రజలు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు గుగులోత్ శ్రీరాం నాయక్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగాతెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



**తిరుమలగిరి,విశాలభారతి :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుమలగిరి పట్టణంలోని పూలే అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ అమరుల చిత్రపటానికి పూలమాలలు సమర్పించి వారి జ్ఞాపకాలను వారి ఉద్యమ నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటూ తెలంగాణ సాధనలో వారు చూపిన కృషిని ప్రశంసిస్తూ ఈ ఉద్యమంలో తొలి మలి ఉద్యమంలో మరణించిన అమరుల జ్ఞాపకాలను ఉపన్యాసాల ద్వారా పాటల ద్వారా తలుచుకుంటూ తెలంగాణ ఆవిర్భావనలో వారు చేసిన కృషిని ప్రశంసిస్తూ ఈ ప్రాంతానికి సంబంధించిన తెలంగాణ ఉద్యమకారులు మరియు సామాజిక తెలంగాణ మహాసభ, తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ అందరూ పాల్గొనడం జరిగింది.

## వాజేడు ఎంపీడీవోగా కొండ కృపాకర్




**వాజేడు, విశాలభారతి :** ములుగు జిల్లా వాజేడు మండలం ఎంపీడీవో గా కొండ కృపాకర్ బాధ్యతలు స్వీకరించారు. వాజేడు ఎంపీడీవో గా పనిచేసిన శ్రీకాంత్ నాయుడు భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కొండ కృపాకర్ బాధితులు స్వీకరించారు నూతన ఎంపీడీవోకు మండల ప్రజా పరిషత్ సిబ్బంది మరియు ఉపాధి హామీ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

## ఐకెపి సెంటర్ ను సందర్శించిన సర్పంచ్

- వడ్లలను త్వరగా మిల్లులకు తరలించాలి: సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి



**చౌటుప్పల్ విశాలభారతి:** మండలంలోని అల్లపురం గ్రామంలో ఐకెపి సెంటర్ సందర్శించిఆ గ్రామ సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి. ఈ సందర్భంగా..మార్కెట్లోని రైతులను వాళ్ళ సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలోని మార్కెట్లను ఆరా తీసినట్లైతే ఇంకా కళ్ళాలాల్లోనే 50 శాతం పైగా వడ్లు ఉన్నాయి. కావున రానున్నది వర్షాకాలం కాబట్టి వర్షాలు పడితే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తదినీ,ఇటీవల గాలి దుమారంతో వచ్చినటువంటి వర్షానికి రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు.కాబట్టి వడ్లను వీలైనంత తొందరగా మిల్లులకు తరలించాలని వారు సూచించారు.రైతులు ఈ ఒడ్లు అమ్మితే వచ్చినటువంటి డబ్బులతోనే మళ్లీ పెట్టుబడి పెట్టుకోవాలి.కాబట్టి పండించిన పంట కల్లాలల్లోనే ఉంటే పెట్టుబడికి చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందినీ తెలిపారు.రైతులు సాగు చేసుకునే సమయం ఆసన్నమైంది కాబట్టి తొందరగా అధికారులు చొరవ తీసుకొని సరిపడా లేబర్ని పెంచినట్లయితే మిల్లుల దగ్గర లారీలు తొందరగా అన్లోడ్ అవుతాయని,కాంటా తొందరగా పెట్టి వడ్లను మిల్లులకు పంపించే అవకాశం ఉంటుంది అని ఈ సందర్భంగా వారు అధికారులని కోరడం జరిగింది.

## రోడ్డు నిర్మాణం కొరకు ప్రజాసంతకాల సేకరణ

- అనంతరం సుప్రీంకోర్టు, హైకోర్టులకు పంపనున్నట్లు వెల్లడి

**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధి పేరూరు, ధర్మారం, చెరుకూరు రహదారి నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రజా పోరాట సమితి ఆధ్వర్యంలో భారీ ప్రజా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆ సంఘం అధ్యక్షులు ముత్తేబోయిన మహేందర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా రవాణా, అత్యవసర వైద్య సేవలకు ఎంతగానో ఉపయోగపడే ఈ రహదారిని ప్రభుత్వం తన స్వార్థ ప్రయోజనాల కోసం పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు.ఇసుక ర్యాంపుల పేరుతో, అడ్డగోలు ఇసుక రవాణా చేస్తూ ప్రజలకు ఉపయోగపడే రోడ్లను పూర్తిగా ధ్వంసం చేశారు. అనంతరం కనీసం మరమ్మతులు గానీ, పునర్నిర్మాణం గానీ చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గం. ఈ ఇసుక మైనింగ్ ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టారా? లేక అధికారులు, రాజకీయ నాయకుల జేబులు నింపుకోవడానికి ఏర్పాటు చేశారా?" అని మహేందర్ ప్రశ్నించారు.

**అటవీ శాఖ అనుమతులు ఉన్నాయా?**

రోడ్డుపై భారీ లారీలు తిరుగుతూ, ఇసుక రవాణా జరిగినప్పుడు జరుగుతున్నప్పుడు, అటవీ శాఖ అధికారుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు అనుమతులు తీసుకుందా లేదా అని ఆయన నిలదీశారు. ఒకవేళ అనుమతులు ఉంటే ఆ వివరాలను బహిర్గతం చేయాలని, లేదంటే అటవీ శాఖ అధికారులు దీనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పుడు రోడ్డు పాడవుతుంటే చూస్తున్న అటవీ శాఖ అధికారులు ఈరోజు రోడ్డు నిర్మాణానికి అడ్డు ఎందుకు పడుతుంధో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సంతకాల సేకరణ అనంతరం ప్రజా ఉద్యమ సారథులు జాడి ఈశ్వర్ నేతకాని సలహాల సూచనల మేరకు ప్రజా న్యాయం కోసం సుప్రీంకోర్టు, హైకోర్టులను ఆశ్రయించనున్నట్లు సంఘం సభ్యులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్య కుమ్మరి శ్రీనాథ్, గార రవి మరియు ప్రజలు పాల్గొన్నారు.



## బీఎస్పీ చీఫ్ బెహెన్ మాయావతి మద్దతో రాష్ట్ర ఏర్పాటు

- బీఎస్పీ లేకుంటే స్వరాష్ట్రమే లేదు
- ఉద్యమకారులను పట్టించుకోనీ కాంగ్రెస్, బీఆర్ఎస్
- మేడపాటి శ్వేతా ఇందిర, మహబూబాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్

**మహబూబాబాద్ జిల్లా విశాలభారతి:**

భారత రాజ్యాంగంలోని మూడవ ఆర్టికల్ ను దృష్టిలో పెట్టుకుని చిన్న రాష్ట్రాల ద్వారానే అభివృద్ధి సాధ్యమని గ్రహించిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు 39 మంది బీఎస్పీ ఎంపీలతో పార్లమెంటులో మద్దతు ఇవ్వడం జరిగిందని, ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని బియస్పి ఎస్పీ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ మేడపాటి శ్వేత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అధ్యక్షులు ఎల్.విజయ్ కాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య



పాల్గొని మంగళవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వరాష్ట్రం కొరకు ప్రాణాలర్పించిన అమరవీరులను, వారి త్యాగంను స్మరిస్తూ, అనంతరం వారు మాట్లాడుతూ... తెలంగాణను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తామే తెచ్చామంటూ గొప్పలు చెప్పుకుంటున్నాయని సందర్భంగా ఆయన విమర్శలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, బహుజన్ సమాజ్ పార్టీ చీఫ్ మాయావతి గారిని 19 సార్లు కలిసిన అనంతరం ఆమె 39 మంది బీఎస్పీ పార్లమెంటు సభ్యులతో తెలంగాణ రాష్ట్రం కొరకు భేషరతుగా మద్దతు తెలిపారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. చిన్న రాష్ట్రాలతోనే స్వపరిపాలన, తెలంగాణ కొరకు మరెవ్వరు బలి కావద్దనే ఉద్దేశంతో నాడు బీఎస్పీ చీఫ్ బెహెన్ మాయావతి స్వరాష్ట్రం కొరకు మద్దతు ఇవ్వడంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని అన్ని రాజకీయ పార్టీలు పక్కనబెట్టి తామే తెచ్చామంటు గొప్పలు చెప్పుకుంటున్నాయని తీవ్రంగా విమర్శలు చేశారు. మాయావతి తెలంగాణ రాష్ట్రా ఏర్పాటుకు (కాంగ్రెస్ కు 200 ఎంపీలు, బీజేపీకు 110 మంది ఎంపీలు మరియు టిఆర్ఎస్ కు ఇద్దరు ఎంపీలు) మద్దతు ఇవ్వకుంటే స్వరాష్ట్రము వచ్చేది కాదన్నారు. కాగా నీళ్లు, నిధులు, నియామకాలు కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయని ఆయన అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ కాలక్షేపాన్ని చేస్తున్నాయన్నారు. మలిదశ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులను కాంగ్రెస్, బిఆర్ఎస్ లు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఉద్యమకారులు ఆర్థికలేమితో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ కోసం కేసులను మీద వేసుకొని, జైలుకెళ్ళి, కోర్టుల చుట్టూ తిరుగుతున్న తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర సమన్వయకర్త రమేష్ నాయక్, బియస్పి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడ్ల శ్రీను, డోర్నకల్ నియోజకవర్గ ఇన్చార్జ్ బందెల కిరణ్ కుమార్, మరిపెడ మండల ఉపాధ్యక్షులు బాసు నాయక్, మండల కార్యదర్శి గూగులోతు ఎన్టీ రామారావు. తదితరులు పాల్గొన్నారు.

## 10 ఏళ్ల చిన్నారి ప్రాణం తీసిన అక్రమ మట్టి దందా!

- మట్టి మాఫియా బలి.. 10 ఏళ్ల బాలుడు మృతి
- అక్రమ మట్టి ట్రాక్టర్ ఢీకొని చిన్నారి దుర్మరణం
- తాళ్ల ఊకల్‌లో విషాదం.. ప్రణీత్ ప్రాణాలు కోల్పోయాడు
- అక్రమ మట్టి దందాపై గ్రామస్తుల ఆగ్రహం
- ఇంకెంతమంది ప్రాణాలు పోతే అధికారులు మేల్కొంటారు?

**మరిపెడ, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం తాళ్ల ఊకల్ గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. అక్రమ మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో 10 ఏళ్ల బాలుడు బోయిని ప్రణీత్ అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నారి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా, కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. గ్రామస్థుల కథనం ప్రకారం, తాళ్ల ఊకల్ గ్రామ సమీపంలోని చెరువు నుంచి కొంతకాలంగా పెద్ద ఎత్తున మట్టి తరలింపు జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. రోజంతా ట్రాక్టర్లు నిరంతరం రాకపోకలు సాగిస్తుండటంతో గ్రామ రహదారులు ప్రమాదకరంగా మారాయని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం బాలుడు ప్రణీత్ రోడ్డుపై వెళ్తుండగా వేగంగా వచ్చిన మట్టి ట్రాక్టర్ ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు బాలుడిని ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిసింది. విషయం తెలియగానే గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ప్రణీత్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించడం అందరినీ కలచివేసింది. ఈ ఘటనపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువుల నుంచి అక్రమంగా మట్టి తరలింపు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రోజూ వందలాది ట్రాక్టర్ ట్రిప్పులు సాగుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ మట్టి దందాను పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో జిల్లాలో కొనసాగుతున్న అక్రమ మట్టి రవాణా మరోసారి చర్చనీయాంశంగా మారింది. లాభాల కోసం సాగుతున్న మట్టి దందా చివరకు ఓ అమాయక చిన్నారి ప్రాణాన్ని బలిగొనడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**దేవరుప్పుల విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ ఊర్మిళమల్లారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ మహిళల సంక్షేమం కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నజియా, ఉప సర్పంచ్ జోగు అనిల్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రజల మంచినీటి పంపును స్వాధీనం చేసుకున్న రోడ్డు కాంట్రాక్టర్


**కనీసం పట్టించుకోని పంచాయితీ, మండల అధికారులు**



**వాజేడు , విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండలం కేంద్ర పరిధి చెరుకూరు గ్రామ ప్రజల దాహం తీర్చడం కోసం చేతిపంపును గత ప్రభుత్వం చెరుకూరు గ్రామం నుండి చింతూరు గ్రామం వెళ్లే రహదారి పక్కన నిర్మించడం జరిగింది. గత రెండు నెలల నుండి చెరుకూరు నుండి చింతూరు గ్రామం వరకు బీటి రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఆ రోడ్డు మలుపు వద్ద ఉన్న చేతిపంపు కాంట్రాక్టర్ స్వాధీనం చేసుకుని పై భాగాన్ని తొలగించి తనకు ఇష్టం వచ్చినట్టు ప్రజల కోసం ఏర్పాటుచేసిన మంచినీటి పంపును ధ్వంసం చేసి విద్యుత్ మోటార్ అమర్చి నీటిని ట్యాంకర్ల ద్వారా రోడ్డు పనులకు కాంట్రాక్టర్ ఇష్టరాజ్యంగా వాడుకుంటున్నాడు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు ఆ రోడ్డు వెంబడి చెరుకూరు మీదుగా వాజేడు మండల కేంద్రానికి అవసరాల నిమిత్తం వెళుతున్న ప్రజలు ఎండ తీవ్రతకు తట్టుకోలేక దాహం తీర్చుకోవడానికి పంపు దగ్గరికి వెళ్లి నిరాశ చెందుతున్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు మరియు వాహనదారులు ఇబ్బంది పడుతున్నప్పటికీ స్థానిక గ్రామపంచాయతీ అధికారులు కానీ, సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉన్నత అధికారులు దృష్టి కేంద్రీకరించి ఆ రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెరుకూరు గ్రామపంచాయతీ ప్రజలు మరియు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

## వేపలగడ్డ రహదరి అసంపూర్తి పనుల పై ఆదివాసిల నిరసన

- 2 కోట్ల వ్యయంతో మంజూరైన బీటీ రోడ్ .. మిడ్ మిక్స్ పోశారు డాంబర్ మరిచారు
- రహదారి పనులపై ఆగ్రహం వ్యక్తం చేసిన: మెండి భాస్కర్






**బూర్గంపాడు, విశాలభారతి:** బూర్గంపాడు మండల పరిధిలోని మర్రికుంటగ్రామం నుండి వేపలగడ్డ, కొమ్మునకిరిపేట గ్రామం వరకు "2" కోట్ల అంచనాతో వ్యయంతో బీటీ రోడ్ మంజురైంది. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యమా లేక కాంగ్రెస్ ప్రభుత్వ ఆలసత్వమా రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి మిడ్ మిక్స్ పోసి అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం ఉన్నప్పటికీ, అంచనా వ్యయంతో కూడిన బోర్డు నిర్మించడంపై స్పష్టత లేకపోవడంతో స్థానికుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రహదారి మంజూరై మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంకా పూర్తి కాలేదు. కానీ అంచనా వ్యయంతో కూడిన బోర్డు ప్రత్యక్షం కావడం స్థానికప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతోరహదారి నిధులు పక్క దారి పట్టినట్టు అనుమానం రావడంతో ప్రజలు మంగళవారం రహదారి వద్దకు చేరుకొని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇదే విషయమై ఆదివాసీల మండల నాయకుడు మెండి భాస్కర్ మాట్లాడుతూ రహదారి నిర్మాణ పనులు పూర్తి కాకముందే అంచనా వ్యయంతో కూడిన బోర్డు నిర్మించడం ఆదివాసి ప్రజలను మోసం చేయడమే అని వాపోయారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రజాధనం దుర్వినియోగం కాకముందే రోడ్డు నిర్మాణం చేపట్టాలని అన్నారు. అదేవిధంగా వర్షాకాలం దృష్ట్యా ఋతుపవనాలు సమీపిస్తుండటంతో వర్షాలు, వరదలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వేపలగడ్డ పంచాయతీ గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రీప్రైమరీ టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**దేవరుప్పుల విశాలభారతి:** దేవరుప్పుల మండలం చిన్నమడూరు ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ఒక ఇన్స్పెక్టర్ (టీచర్) ఒక ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన ఉపాధ్యాయురాలు ఎం. మాధవి తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తులు జూన్ 5/2026 శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల లోపు పాఠశాలల్లో సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9492 114165 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.

## రాములు తండాలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**జాతీయ జెండాను ఎగురవేసిన సర్పంచ్ బాదావత్ రమేష్**



**విశాలభారతి, గూడూరు జూన్:** గూడూరు మండలం రాము తండా గ్రామంలోని తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అనేక మంది అమరవీరుల త్యాగాలు, విద్యార్థుల పోరాటాలు, ప్రజల ఆకాంక్షలు, ఉద్యమాల ఫలితంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రానికి హృదయపూర్వక ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ కేవలం రాజకీయ నినాదం కాదు; ప్రాంతీయ అభివృద్ధి, నీటి వనరుల సమాన వినియోగం, ఉపాధి అవకాశాలు, సాంస్కృతిక గుర్తింపు మరియు స్వయం పాలన కోసం ప్రజలు వ్యక్తం చేసిన న్యాయమైన ఆకాంక్ష. ఆ ఆశయాల సాధన కోసం వేలాది మంది చేసిన త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకుందాం.

**త్యాగాల పునాదులపై నిర్మితమైన తెలంగాణ**

స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ, ప్రజల ఆకాంక్షలకు రూపమైన తెలంగాణ మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని కోరుకుంటూ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు."తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాములు తండా పాలక మండలి గ్రామ పెద్దలు నాయకులు స్కూల్ టీచర్స్ అంగన్వా టీచర్స్ పాల్గొనడం జరిగింది

## తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలి

**సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి**



**కురవి విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొరివి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పన్నెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఉద్యమ సమయంలో ప్రజలు ఆశించిన అనేక ఆకాంక్షలు ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరలేదన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల ఆశయాలను అమలు చేయడంలో గత ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలను కేంద్రంగా చేసుకుని ఏర్పడిన ప్రజా ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ, అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగించాలని కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగం, వ్యవసాయం, విద్య, వైద్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమం కేవలం రాష్ట్ర సాధనతో ముగిసిపోలేదని, ఉద్యమ లక్ష్యాల సాధన కోసం ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కాలంలో రిపోర్టర్‌గా తనదైన పాత్ర పోషించి ఉద్యమానికి విశేష సేవలందించిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ ఆమెడ శ్రీధర్‌ను, అలాగే ఉద్యమకారుడు కిన్నెర మల్లయ్యను నల్లు సుధాకర్ రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బుడమ వెంకన్న, కొరివి టౌన్ కార్యదర్శి తుర్క రమేష్, దూదికట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, కాట్యాల కృష్ణ, బొల్లం విజయ్, అనిల్ తదితరులు పాల్గొని తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కాపాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామని నాయకులు పేర్కొన్నారు.

## తెలంగాణ అమరవీరుల స్థూపానికి ఖాదర్ బాబా ఘన నివాళి



**మహబూబాబాద్ విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బేతోలు గ్రామంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఖాదర్ బాబా అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఖాదర్ బాబా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. అమరవీరుల పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బేతోలు 6వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంజీతో పాటు గద్దపాటి సంతోష్, అనపర్తి మదన్, సిరికొండ కృష్ణ, మేడార్పు శీను, దూదికట్ల మధుకర్, ఏర్పుల హుస్సేన్, గూగుల్ సీతారాం, పాల్వాయి రమేష్, పోలేపొంగు సర్వయ్య, పాల్వాయి శ్రీను, రాసాల కర్ణాకర్ తదితరులు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. "తెలంగాణ అమరవీరుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్రం" అని ఖాదర్ బాబా పేర్కొన్నారు.

## గూడూరులో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**విశాలభారతి, గూడూరు:** గూడూరు మండల కేంద్రంలోని కార్యాలయంలో జాతీయ. జెండా ను మరియు పార్టీ జెండాను ఆవిష్కరించిన చీదురు వెంకన్న తదనంతరం జలగం సంపత్ రావు మాట్లాడుచు తెలంగాణ రాష్ట్రం కోసం ప్రత్యేక రాష్ట్ర కళా సహకారం కోసం శాంతియుత ఉద్యమాల ద్వారా KCRఆధ్వర్యంలో ఎన్నో బలిదానాల వలన ప్రత్యేక రాష్ట్రం సాధించబడింది విద్యార్థులు మేధావులు కర్షకులు కార్మికులు అందరిని ఏకతాటిపై తీసుకువచ్చి ఎప్పటికీ సాధించలేని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వీరుడు కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత పది సంవత్సరాలు కెసిఆర్ పరిపాలనలో అనేక రంగాలలో దూసుకుపోయి దేశంలోని అగ్రగామిగా ఏర్పడినది తెలంగాణ రాష్ట్రమని పేర్కొనబడినది. ఈ కార్యక్రమంలో గూడూరు మండల బిఆర్ఎస్ నాయకులు ఆరే వీరన్న వాంకుడోత్ కటార్ సింగ్, భానోత్ నర్సింహ నాయక్గూ గులోతు చందర్ నాయక్, కాల్ సాని వేణుమాధవ్ రెడ్డి వల్లెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు


## జిల్లా కోర్టు ఆవరణలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**జనగామ విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జనగామ జిల్లా కోర్టు ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ సీనియర్ సివిల్ జడ్జి శంకరన్. శ్రీదేవి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శశి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండ దయాకర్ రెడ్డి ఉపాధ్యక్షుడు రాజయ్య తో పాటు న్యాయవాదులు యెల్లారెడ్డి, కూరెల్ల శ్రీనివాస్ రెడ్డి, మంచాల రవీందర్, వెంకట నరసయ్య, శ్రీహరి, ఆలే బాలరాజ్ పవన్, అమృత రావు, ఆకుల శ్రీనివాస్, కలకుంట శ్రీనివాస్, జి రవీందర్, అరవింద్, జే.పీ. సంధ్యారాణి, పిపి శ్రీనివాస్, ఎజిపి చెరుకు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. మహిళా న్యాయవాదులు రేణుక, దయామణి, కూడా హాజరయ్యారు.

# పైన పదహారు నొక్కేస్తున్నారు

- పై కోసరు రూ.16 సంగతి ఏమిటి
- ఆసరా పింఛన్ల పంపిణీలో చిల్లర పేరుతో కోతలు
- లబ్ధిదారులకు అందని రూ.16లు..
- లక్షల్లో మాయమవుతున్నాయా?
- తపాలా సిబ్బంది తీరుపై పింఛన్దారుల ఆవేదన
- దివ్యాంగులకు రూ.4016 బదులు రూ.4000
- ఇతరులకు రూ.2016 బదులు రూ.2000 మాత్రమే
- గట్టిగా అడిగితేనే ఇచ్చే రూ.16... అడగకపోతే మాయం





**మహబూబాబాద్, విశాలభారతి:**

రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఆసరా పింఛన్ పథకాన్ని అమలు చేస్తోంది. ప్రతి నెలా కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలుస్తోంది. అయితే ప్రభుత్వ సంక్షేమ పథకాల అసలు ఉద్దేశ్యాన్ని కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది నీరుగారుస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం దివ్యాంగులకు రూ.4016, ఇతర పింఛన్దారులకు రూ.2016 చెల్లిస్తుండగా, అనేక గ్రామాల్లో లబ్ధిదారుల చేతికి మాత్రం రూ.4000, రూ.2000 మాత్రమే అందుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిగిలిన రూ.16లను "చిల్లర లేదు" అనే పేరుతో నిలిపివేస్తున్నారని పింఛన్దారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే పూర్తి మొత్తాన్ని అందించాల్సిన బాధ్యత ఉన్న సిబ్బంది ఇలా వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**"చిల్లర లేదు" అనే మాటతో పేదల హక్కులను కాజేస్తున్నారా?**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నెలా పింఛన్ పంపిణీ రోజున వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు గంటల తరబడి నిరీక్షిస్తూ తమ వంతు కోసం ఎదురు చూస్తుంటారు. వయసు మీద పడిన వారు కర్రల సాయంతో వస్తుంటే, కొందరు దివ్యాంగులు ఇతరుల సహాయంతో పింఛన్ కేంద్రాలకు చేరుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారికి రావాల్సిన పూర్తి మొత్తాన్ని అందించడం అధికారుల బాధ్యత.

అయితే "చిల్లర లేదు", "తర్వాత ఇస్తాం", "ఇప్పుడే సరిపెట్టుకోండి" వంటి కారణాలతో రూ.16లను నిలిపివేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. చాలా మంది వృద్ధులకు అసలు ప్రభుత్వం ఎంత ఇస్తోందో తెలియదు. నిరక్షరాస్యులు కావడంతో రసీదులు కూడా పరిశీలించలేరు. ఈ బలహీనతనే కొందరు అవకాశంగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఒక్కో లబ్ధిదారుని వద్ద రూ.16... కానీ మొత్తం లెక్క వేస్తే లక్షల రూపాయలే!**

"కేవలం రూ.16 మాత్రమే కదా" అని కొందరు భావించవచ్చు. కానీ ఈ రూ.16 వెనుక ఉన్న లెక్కలు చూస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. ఒక గ్రామంలో 500 మంది పింఛన్దారులు ఉంటే, వారిలో 250 మందికి కూడా రూ.16 ఇవ్వకుండా ఉంచితే నెలకు రూ.4,000 వరకు మొత్తం నిలిచిపోతుంది. అదే ఒక మండలంలో 20 గ్రామాలు ఉంటే నెలకు రూ.80 వేల వరకు చేరుతుంది. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉంటే లక్షల రూపాయలు లబ్ధిదారులకు అందకుండా పోయే ప్రమాదం ఉంది. సంవత్సరం మొత్తానికి ఈ మొత్తం కోట్ల రూపాయల స్థాయికి చేరుకునే అవకాశం ఉందని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చిట్టెడు చిట్టెడు చిల్లరగా కనిపించే మొత్తం, చివరకు పెద్ద ఎత్తున ఆర్థిక అక్రమానికి దారితీస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.

**నిరుపేదల కష్టార్జిత హక్కులపై దాడి చేస్తున్నట్టే!**

పింఛన్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదు. అది అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సామాజిక భద్రత హక్కు. వృద్ధాప్యంలో ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్న వారికి, భర్తను కోల్పోయిన వితంతువులకు, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులకు ఈ పింఛన్ జీవనాధారం. అలాంటి వారి డబ్బుల్లో కోతలు పడటం కేవలం ఆర్థిక నష్టం మాత్రమే కాదు, వారి గౌరవాన్ని దెబ్బతీయడమేనని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఒక పేద కుటుంబానికి రూ.16 కూడా విలువైనదే. అదే డబ్బుతో మందులు కొనుగోలు చేసే వారు ఉన్నారు. బియ్యం, కూరగాయలు కొనేవారు ఉన్నారు. అలాంటి మొత్తాన్ని చిన్నచూపు చూడడం మానవత్వానికి విరుద్ధమని ప్రజలు మండిపడుతున్నారు.

**ఫిర్యాదులు వస్తున్నా ఎందుకు చర్యలు లేవు?**

ఈ వ్యవహారంపై పలువురు బాధితులు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ప్రజావాణి కార్యక్రమాల్లో కూడా సమస్యను ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఫిర్యాదులు వచ్చిన వెంటనే విచారణ జరపాల్సిన అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారు? నిజంగా అక్రమాలు జరగకపోతే ప్రజల అనుమానాలను నివృత్తి చేసే ప్రయత్నం ఎందుకు చేయడం లేదు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే క్షేత్రస్థాయిలో ఇష్టారాజ్యం కొనసాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ప్రతి పైసాకు లెక్క తేల్చాలి**

ప్రభుత్వం విడుదల చేస్తున్న ప్రతి రూపాయి లబ్ధిదారుల చేతికి పూర్తిగా చేరేలా కఠిన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పింఛన్ పంపిణీ సమయంలో చెల్లించిన మొత్తాన్ని రసీదుల్లో స్పష్టంగా చూపించాలి. గ్రామ స్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి. ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం ఎంత అనే విషయంపై అవగాహన కల్పించాలి. అలాగే గత నెలల్లో జరిగిన పంపిణీలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించి, ఎక్కడైనా కోతలు జరిగాయా లేదా అనే అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. "రూ.16 మాత్రమే కదా" అని వదిలేస్తే అదే రూ.16లు వేలుగా, లక్షలుగా, కోట్లుగా మారే ప్రమాదం ఉందని పింఛన్దారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం నిరుపేదల కోసం కేటాయిస్తున్న ప్రతి పైసా అర్హుల చేతికి చేరినప్పుడే సంక్షేమ పథకాల అసలు లక్ష్యం నెరవేరుతుందని, అందుకే ప్రతి పైసాకు లెక్క తేల్చాలని ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

## రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు



- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- మహబూబాబాద్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**మహబూబాబాద్ విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారి త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్రం అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే ఈ పర్వదినం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని అన్నారు.

**పోరాటాల పునాదిపై నిర్మితమైన స్వరాష్ట్రం**

ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేక అవమానాలు, అవాంతరాలు, ఆధిపత్య ధోరణులు, రాజకీయ అణచివేతలను ఛేదించి సాధించుకున్న స్వరాష్ట్రం అని పేర్కొన్నారు. అసంఖ్యాక ఉద్యమకారుల త్యాగాలు, విద్యార్థుల పోరాటాలు, ఉద్యోగుల సమ్మెలు, ప్రజల అంకితభావం కలిసి తెలంగాణ రాష్ట్రాన్ని సాకారం చేశాయని చెప్పారు. తెలంగాణ కేవలం ఒక రాష్ట్రం మాత్రమే కాదని, ప్రజాస్వామ్య పోరాటాలకు దిక్సూచిగా నిలిచిన చరిత్రాత్మక ఉద్యమ ఫలమని పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యంతో సాగిన ఉద్యమం నేడు కోట్లాది ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రయాణించిందన్నారు.

**కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం కొత్త దిశగా**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందని సత్యవతి రాథోడ్ అన్నారు. కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ వంటి పథకాలు రైతాంగానికి అండగా నిలిచాయని తెలిపారు. సమైక్య పాలనలో దశాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురైన తెలంగాణను పచ్చని పంటల తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. ఐటీ రంగంలో పెట్టుబడులు, టీఎస్ఐపాస్ విధానం ద్వారా పరిశ్రమలకు ప్రోత్సాహం, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా తెలంగాణ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా ఎదిగిందన్నారు. బీడు భూములను సస్యశ్యామలం చేసి రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు.


**రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సత్యవతి.**

ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యల కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, ముఖ్యంగా మానుకోట ప్రజలకు మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ శ్రీమతి మాలోత్ కవిత, రాష్ట్ర బీఆర్ఎస్ యువ నాయకులు శ్రీరాం నాయక్, జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రవి గ్రాఫిక్స్ అధినేత దంపతులు మృతి

**విశాలభారతి, మణుగూరు :**



పాత మణుగూరు ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, రవి గ్రాఫిక్స్ అధినేత రవి మరియు అతని భార్య సునీత మంగళవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో వారి కుమారుడు, కోడలు తీవ్రంగా గాయపడ్డారు. రవి తన భార్య సునీత, కుమారుడు, కోడలితో కలిసి కారులో మణుగూరు నుండి సిద్దిపేటకు బయలుదేరారు. మార్గమధ్యంలో, సిద్దిపేట సమీపంలో వారి కారు ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో రవి, సునీత దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, కుమారుడు, కోడలు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రవి దంపతులు సుదీర్ఘ కాలం పాటు మణుగూరు, బందారు గూడెం, భద్రాచలం ప్రాంతాల్లో 'రవి గ్రాఫిక్స్' పేరిట సేవలందించారు. గ్రాఫిక్స్ రంగంలో వారికి మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. కొంతకాలం క్రితం సిద్దిపేటలో స్థిరపడి అక్కడ కూడా తమ సేవలను కొనసాగిస్తూ ప్రజల మన్ననలు పొందారు. రవి తన అన్న, లక్ష్మి గ్రాఫిక్స్ అధినేత ప్రభాకర్ ఇంటికి వెళ్లి తిరిగి సిద్దిపేటకు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అకాల మరణం చెందిన రవి దంపతుల మృతి వార్త తెలుసుకున్న మణుగూరు పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు, పుర ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రవి, సునీత దంపతుల మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన కుమారుడు, కోడలు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. అలాగే, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**విశాలభారతి, ఎన్టీపీసీ:** రామగుండం నియోజకవర్గ పరిధిలోని పాలకుర్తి, అంతర్గాం మండలాల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై మంగళవారం ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా కృషి చేయాలని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే నియోజకవర్గ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొని తమ మండలాల సమస్యలు, అభివృద్ధి అవసరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై స్పందించిన ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**విశాలభారతి గోదావరిఖని:** రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ 128 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ. పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ పథకాల ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతూ తమ కుమార్తెల వివాహాలను ఆర్థిక ఇబ్బందులు లేకుండా నిర్వహించుకోగలుగుతున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**విశాలభారతి గోదావరిఖని:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరల పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు సాగిన ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన సోనియా గాంధీ నాయకత్వాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు..



# ఆదివాసుల సభను అడ్డుకోవడం లేదు

- లంబాడీ జాతిని కించపరిస్తే సహించం
- సభను అడ్డుకుంటున్నారనే ప్రచారం అవాస్తవం
- గిరిజన హక్కుల ఉద్యమాలకు మద్దతు ప్రకటించిన భీమా నాయక్
- లంబాడీ జాతిని కించపరిస్తే తీవ్ర ప్రతిఘటన హెచ్చరిక
- ఆదివాసీ-లంబాడీల ఐక్యతను దెబ్బతీయొద్దని పిలుపు
- లంబాడీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూగులోతు భీమా నాయక్



**మహబూబాబాద్ విశాలభారతి:**

కొత్తగూడ మండలంలో నిర్వహించనున్న ఆదివాసుల మహాసభను లంబాడీ సమాజం అడ్డుకుంటోందంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని లంబాడీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూగులోతు భీమా నాయక్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఆదివాసీ, లంబాడీ సమాజాల మధ్య అనవసర వివాదాలను సృష్టించే ప్రయత్నాలను ఖండించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ఎవరైనా ఎక్కడైనా శాంతియుతంగా సభలు, సమావేశాలు నిర్వహించుకోవచ్చని, ఆ హక్కును తాము గౌరవిస్తున్నామని తెలిపారు.

**సభ నిర్వహణకు వ్యతిరేకం కాదు**

కొత్తగూడ మండలంలో ఆదివాసీ సంఘాలు నిర్వహించబోయే సభను అడ్డుకుంటున్నారనే ప్రచారం ఉద్దేశపూర్వకంగా జరుగుతోందని భీమా నాయక్ పేర్కొన్నారు. ఆదివాసీ సోదరులు తమ హక్కుల సాధన కోసం సభలు, సమావేశాలు నిర్వహించుకోవడం వారి రాజ్యాంగబద్ధమైన హక్కు అని చెప్పారు. అలాంటి కార్యక్రమాలను వ్యతిరేకించే ఉద్దేశం తమకు లేదని, ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు.

**గిరిజన హక్కుల పోరాటానికి మద్దతు.**

గిరిజనుల హక్కుల సాధన కోసం జరుగుతున్న ఉద్యమాలకు లంబాడీ సమాజం ఎప్పటికీ వ్యతిరేకం కాదని భీమా నాయక్ స్పష్టం చేశారు. చేవెళ్ల ఎస్టీ డిక్లరేషన్ అమలు, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై జరిగే పోరాటాల్లో అవసరమైతే కలిసి నడవడానికి కూడా సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. హక్కుల కోసం చేసే పోరాటం అన్ని గిరిజన, బడుగు వర్గాల ఐక్యతతోనే విజయవంతమవుతుందని అభిప్రాయపడ్డారు.

**లంబాడీ జాతిని అవమానిస్తే సహించేది లేదు.**

సభల వేదికలపై లంబాడీ జాతిని కించపరిచే వ్యాఖ్యలు చేయడం, అవమానించే ప్రయత్నాలు చేయడం మాత్రం సహించబోమని భీమా నాయక్ హెచ్చరించారు. హక్కుల కోసం జరిగే ఉద్యమాలు ఒక జాతిని కించపరచడం కోసం కాకుండా, సమాజ అభ్యున్నతి కోసం జరగాలని అన్నారు. ఎవరు ఎక్కడ ఉన్నా లంబాడీ సమాజ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడితే తీవ్రంగా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు.

**రాష్ట్రంలో మూడో అతిపెద్ద జనాభా లంబాడీలది.**

తెలంగాణ రాష్ట్రంలో లంబాడీ సమాజం మూడో అతి పెద్ద కుల జనాభా కలిగిన వర్గమని భీమా నాయక్ గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది లంబాడీలు వివిధ రంగాల్లో సేవలందిస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడుతున్నారని చెప్పారు. అలాంటి పెద్ద సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం సామాజిక సామరస్యానికి విఘాతం కలిగిస్తుందని హెచ్చరించారు. లంబాడీలతో అనవసర ఘర్షణలకు దిగితే పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశముందని పేర్కొన్నారు.

**ఆదివాసీ-లంబాడీల ఐక్యతను దెబ్బతీయొద్దు.**

తరతరాలుగా ఆదివాసీలు, లంబాడీలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తున్నారని భీమా నాయక్ తెలిపారు. ఈ రెండు వర్గాల మధ్య లేని విభేదాలను సృష్టించి రాజకీయ లేదా వ్యక్తిగత ప్రయోజనాలు పొందాలని చూస్తున్న శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. పరస్పర గౌరవం, సోదరభావంతో హక్కుల సాధన కోసం పోరాటాలు కొనసాగించాలని, శాంతియుత వాతావరణంలోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆదివాసీ, లంబాడీ సమాజాలు ఐక్యంగా ఉంటేనే గిరిజన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## అసంఘటిత కార్మికులకు న్యాయం బీఆర్ఎస్‌తోనే సాధ్యం: సిందం శ్రీకాంత్




**హైదర్‌నగర్ విశాల భారతి:** హైదర్‌నగర్ భావన నిర్మాణ కార్మికుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ. ఖదీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, న్యాయవాది సిందం శ్రీకాంత్, ప్రముఖ కార్మిక నాయకుడు గోపాల్ రవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సిందం శ్రీకాంత్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని అసంఘటిత కార్మికులకు నిజమైన న్యాయం జరగాలంటే అది బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా కే. చంద్రశేఖర్ రావు రైతుల భద్రత కోసం రైతు బీమా వంటి వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతాంగానికి అండగా నిలిచారని గుర్తు చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైడ్రా అధికారుల అతి ఉత్సాహ చర్యల కారణంగా నిర్మాణ రంగం తీవ్రంగా దెబ్బతిందని, దీంతో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులుఎదుర్కొంటున్నారని విమర్శించారు.రాబోయే రోజుల్లో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు నిర్మాణ రంగంతో పాటు అన్ని రంగాలకు చెందిన కార్మికులకు మెరుగైన ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి వస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశానికి హాజరైన కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యాధుల్ మేస్త్రి, శంకర్ నాయక్, బాబు, హైమద్, అషు, రషీద్ భాయ్, భాష తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

**జాతీయ జెండా ఆవిష్కరించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి.**



**మేడిపల్లి విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలో అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహాల వద్ద పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు.అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన బీఆర్ఎస్ అధినేత తెలంగాణ తొలిముఖ్యమంత్రి K. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వాన్ని గుర్తు చేసుకుంటూ తెలంగాణ ఆవిర్భావం వెనుక ఉన్న ఉద్యమ చరిత్రను కొనియాడారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్రం అనేది కోట్లాది ప్రజల కల. ఆ కలను సాకారం చేయడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ఉద్యమం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. "తెలంగాణ అనేది ఒక రాష్ట్రం మాత్రమే కాదు... అది త్యాగాల ఫలితం, ఆత్మగౌరవానికి ప్రతీక. అమరవీరుల ఆశయాలు, కేసీఆర్ చూపిన దిశే తెలంగాణ భవిష్యత్తుకు మార్గదర్శకం."తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన కేసీఆర్ చూపిన మార్గంలో రాష్ట్ర హక్కులు, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, జావీద్ ఖాన్, యూత్ అధ్యక్షులు ప్రభు, ఆకుల మధుకర్, శ్యామల శ్రీనివాస్, జిలాని పాషా, కందుకూరి ఆంజనేయులు, బాలరాజు, కోనేటి వెంకట్, మునికుంట్ల కిరణ్ గౌడ్, బుల్లెట్ శంకర్, ప్రవీణ్ రెడ్డి, శ్రీరాములు గౌడ్, అయోధ్య యాదవ్, శ్రీకాంత్, జోసెఫ్ రెడ్డి, శివరాజు, వారికల శ్రీనివాస్, రాయల అశోక్, సతీష్, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ రెడ్డి, మల్లం వెంకటేష్ గౌడ్, వెంకట్, రామకృష్ణ, తిరుమలేష్,అమర్ పటేల్, UBA 7అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ, పుల్ల శ్రీనివాస్, మేడబోయిన విజయ్ యాదవ్, జమీల్, సుభాన్, కళ్యాణి, ఇందిరా, లావణ్య, సరస్వతి, సరిత, సావిత్రి, సంధ్య, పన్నాభాయ్, అక్కలశ్రీనివాస్, శంకర్ గౌడ్. పాశం నరేందర్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు

## పోలీస్ అకాడమీలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు









**రాజేంద్రనగర్, విశాలభారతి :** తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)లో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. అకాడమీ సుదర్శన్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ కె. జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ట్రైనీ అధికారులు నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేక మంది విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, మేధావులు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సాగిన తెలంగాణ ఉద్యమం భారతదేశ చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించిందని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగా, పోలీస్ శాఖ కూడా ఆధునికీకరణ, సాంకేతికత వినియోగం, మౌలిక వసతుల అభివృద్ధిలో ముందంజలో ఉందని చెప్పారు. "పీపుల్ సెంట్రిక్ పోలీసింగ్" మరియు "ఫ్రెండ్లీ పోలీసింగ్" విధానాల ద్వారా ప్రజల విశ్వాసాన్ని సంపాదించామని వెల్లడించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆర్థిక నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనేందుకు ఆధునిక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ట్రైనీ అధికారులను ఉద్దేశించి క్షేత్రస్థాయిలో పనిచేసే సమయంలోనే నిజమైన అనుభవం లభిస్తుందని, ప్రతి సవాల్‌ను నేర్చుకునే అవకాశంగా మలుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలందించిన అసిస్టెంట్ డైరెక్టర్ టి. భరత్‌కు ఉత్తమ సేవా పతకం, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ గురవయ్య, రిజర్వ్ కానిస్టేబుల్ శివలకు సేవా పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, ఫ్యాకల్టీ సభ్యులు, అకాడమీ సిబ్బంది, ట్రైనీ అధికారులు పాల్గొన్నారు. దేశభక్తి, ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**రాజేంద్రనగర్, విశాలభారతి:** జీహెచ్ఎంసీ శంషాబాద్ జోనల్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కుమారి కే. చంద్రకళ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, వేడుకలను ప్రారంభించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపిస్తూ సభను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ సర్కిల్ 18 డిప్యూటీ కమిషనర్ బి. సుమన్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కె. సుశ్మ మహేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అన్ని రంగాల్లో సాధించిన అభివృద్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి వంటి అంశాల్లో రాష్ట్రం ముందంజలో ఉందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు, దేశభక్తి గీతాలు, నినాదాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. దేశభక్తి వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమం సమన్వయానికి జోనల్ కార్యాలయ సిబ్బంది విశేషంగా కృషి చేశారు.



## ఆల్విన్ కాలనీ సర్కిల్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

**డీసీ ఇ. చాముండేశ్వరి ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆవిష్కరణ**



**కూకట్‌పల్లి విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్విన్ కాలనీ సర్కిల్‌లో మంగళవారం జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.సర్కిల్ 51 డిప్యూటీ కమిషనర్ ఇ. చాముండేశ్వరి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక సిబ్బంది అంతా పెద్ద సంఖ్యలో హాజరై జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. పుష్పాలతో అలంకరించిన స్తంభంపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, జాతీయ గీతం ఆలపించారు.రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళలు, ఉద్యోగులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పెరిగిన ఆయిల్ పామ్ ధరలతో రైతులకు లాభాల పంట

**ఎకరానికి లక్ష రూపాయలకు పైగా ఆదాయం.. మహబూబాబాద్ జిల్లాలో సాగు విస్తరణ**



**మహబూబాబాద్ విశాలభారతి:** ఆయిల్ పామ్ గెలల ధరలు పెరగడంతో మహబూబాబాద్ జిల్లా రైతులకు లాభాల పంటగా మారుతోంది. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.23,852కు చేరుకోవడంతో సాగు చేస్తున్న రైతులు ఎకరానికి లక్ష రూపాయలకు పైగా ఆదాయం పొందుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 8,900 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 2,500 ఎకరాల్లో సాగు విస్తరణకు అధికారులు చర్యలు చేపట్టారు. సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయం అందిస్తున్న ఆయిల్ పామ్ సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎకరానికి రూ.52 వేల వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక లాభదాయకమైన పంటల సాగు వైపు అడుగులు వేయాలని సూచించారు. అదేవిధంగా రైతులు జామ, నేరేడు, పనస, సీతాఫలం, సపోటా వంటి ఉద్యాన పంటలతో పాటు టమోటా, వంకాయ, బెండకాయ, బీరకాయ, సొరకాయ, ఉల్లి, చిక్కుడు, దోసకాయ, ఆకుకూరలు తదితర కూరగాయల సాగును కూడా చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అనుసరించేందుకు ప్రభుత్వం అందిస్తున్న మల్చింగ్, బిందు సేద్యం, నీటి కుంటలు వంటి రాయితీ పథకాలను రైతులు వినియోగించుకోవాలని, తద్వారా సాగు వ్యయాన్ని తగ్గించుకుని అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.

## అద్దంకి దయాకర్ కి అభినందనలు తెలిపిన పొట్లకాయల



**సికింద్రాబాద్, విశాలభారతి:** తెలంగాణ ఉద్యమకారుడు అద్దంకి దయాకర్ గకి తెలంగాణ ఉద్యమకారుల కమ్యూనిటీ లో కీలకమైన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా హృదయపూర్వక అభినందనలు శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ ఉద్యమం కారుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్. తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది త్యాగాల తోని తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు సరైన గుర్తింపు ఇచ్చి వాళ్లకు న్యాయం చేస్తానని ప్రకటించడం తెలంగాణ ఉద్యమకారులు ఎంతో సంతోషంగా కార్యక్రమం జరుపుకోవడం జరిగింది. ఈ యొక్క కమిటీలు పెద్దలు కే కేశవ రావుకి కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు జై తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

## హయత్‌నగర్ పీసీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

- జాతీయ పతాకావిష్కరణతో అమరవీరులకు ఘన నివాళులు
- పోలీస్ సిబ్బందిలో దేశభక్తి, సేవా స్ఫూర్తిని పెంపొందించేలా కార్యక్రమం

**విశాలభారతి, హయత్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ వారి త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు కారణమైన ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు మరింత అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది పరస్పరం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, రాష్ట్ర ప్రగతిలో పోలీస్ శాఖ కూడా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ ఇన్స్పెక్టర్ సంతోష్‌కుమార్, సబ్ ఇన్స్పెక్టర్లు నరసింహ లక్ష్మీనారాయణ, వెంకట్ రెడ్డి, అరుణ్ కుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ విద్యార్థి అమరవీరుల ఆశయ సాధనకై ఉద్యమిద్దాం

- అమరవీరుల ఆశయాల సాధనకు యువత ఉద్యమించాలి
- తెలంగాణ అమరవీరులకు బానోత్ దేవేందర్ నివాళులు
- అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం
- ప్రతి తెలంగాణ బిడ్డ అమరవీరులను స్మరించుకోవాలి
- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం
- పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్



**మహబూబాబాద్ విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బానోత్ దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన విద్యార్థులు, యువకులు, ఉద్యమకారుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను ప్రతి తెలంగాణ బిడ్డ గుర్తుంచుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేందుకు విద్యార్థులు కీలక పాత్ర పోషించారని, వారి ఆశయాలు పూర్తిస్థాయిలో నెరవేరే వరకు పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. అమరవీరులు కలలుగన్న సమానత్వం, సామాజిక న్యాయం, ఉపాధి అవకాశాలు, విద్యా అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం యువత ముందుకు రావాలని అన్నారు. తెలంగాణ అమరవీరుల ఆశయ సాధనకై ప్రతి తెలంగాణ బిడ్డ ఉద్యమించాలని, రాష్ట్ర అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేయాలని బానోత్ దేవేందర్ పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

## సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వ పరిపాలన



- ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు
- రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

**విశాలభారతి, పెద్దపల్లి:**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెద్దపల్లి పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో భాగంగా ఉదయం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన తదుపరి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.అనంతరం సమీకృత కలెక్టరేట్ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి పూలమాలలు సమర్పించడం జరిగింది.తదుపరి పోలీసు కవాతు నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉన్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా రక్షణ కల్పించే "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా" పథకాన్ని జూన్ 2 నుంచి అమలు చేస్తున్నామని తెలిపారు. కుటుంబ పోషకుడు మరణించిన సందర్భంలో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువజనాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.విద్యారంగంలో ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నూతనంగా అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించామని చెప్పారు. జిల్లాలోని 547 పాఠశాలల ద్వారా సుమారు 37 వేల మంది విద్యార్థులకు విద్య అందుతోందని, ఎఫ్.ఆర్.ఎస్ విధానంలో 96 శాతం హాజరు నమోదవుతోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ.17 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని, రూ.66 లక్షలతో భవిత కేంద్రాలను అభివృద్ధి చేశామని, పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన 16 పాఠశాలలను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. రెండో విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2 వేల చొప్పున మొత్తం 6 వేల ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.202526 యాసంగి సీజన్‌లో 334 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.767.09 కోట్ల విలువైన 3,23,773 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధరను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు .ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ, డిసిపి రాంరెడ్డి, డిఆర్ఓ రాజేశ్వరి, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, నూగిల్ల మల్లయ్య ,ఆర్డీఓ బి. గంగయ్య, కలెక్టరేట్ ఏఓ ప్రకాష్, జిల్లా అధికారులు ,మార్కెట్ చైర్మన్ లు, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు మరియు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండా ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్
- అమరవీరుల స్థూపానికి నివాళులు
- ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ.. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు.



**మహబూబాబాద్ విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించేలా ముస్తాబవగా, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, సిబ్బంది, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రధాన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించడంతో కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పోలీసు శాఖ సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగులు నిర్వహించిన పరేడ్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, డీఎఫ్‌వో విశాల్ బత్తుల, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జడ్పీ సీఈవో పురుషోత్తం, ఆర్డీఓ క్రిష్ణవేణి, ఇతర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనేకమంది విద్యార్థులు, యువకులు, ప్రజలు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. రాష్ట్ర ఏర్పాటుతో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువ అవుతున్నాయని తెలిపారు. జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా రెండవ దశ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని కోర్టు సెంటర్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీతో పాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ వారి త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ సాధన ఉద్యమం చరిత్రలో అమరవీరుల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సాంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించే నృత్యాలు, గేయాలు, కళారూపాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, పాటలు సభికులను అలరించాయి. విద్యార్థుల ప్రతిభకు హాజరైనవారు ప్రశంసలు కురిపించారు. జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించేలా వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు కూడా ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులు వివరాలు తెలియజేశారు. కార్యక్రమం మొత్తం తెలంగాణ ఆత్మగౌరవాన్ని, రాష్ట్ర సాధన ఫలితాలను ప్రతిబింబించేలా సాగింది. ఈ వేడుకల్లో మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి, జిల్లా రెవెన్యూ అధికారి నాగలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు




**దేవరుప్పుల విశాలభారతి:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరుప్పుల మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద బిఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గొల్లపల్లిలో తెలంగాణ అమరవీరుడు శ్రీకాంత్ చారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందరాంరెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంత్ చారి చేసిన త్యాగాలను గుర్తు చేశారు. అనంతరం దేవరుప్పుల మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ అవిర్భవ వేడుకలు

**జాతీయ జెండాను ఎగరవేసిన ఏసీపీ నరేష్ రెడ్డి**



**కూకట్ పల్లి, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ అవతరణ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ జెండాను ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం బాలానగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకల్లో.. ఏసీపీ నరేష్ రెడ్డి తొలుత తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాల ఆలపనతో పోలీస్ స్టేషన్ ఆవరణలో దేశభక్తి పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఏసీపీతో పాటు బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా రాజు, డీఐ సక్రమ్ మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి పోలీస్ సిబ్బందికి, ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది ఉద్యమకారుల సుదీర్ఘ పోరాటం, మరెంతో మంది అమరవీరుల ప్రాణత్యాగాల ఫలితంగానే 2014, జూన్ 2న తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ స్మరణీయం. ప్రస్తుతం తెలంగాణ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే అగ్రగామిగా నిలిచి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి ప్రతి పౌరుడు, ప్రతి పోలీస్ అధికారి బాధ్యతగా పని చేయాలన్నారు.

## శిల్పారామంలో అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు

**రెండు రోజుల పాటు 'అవతరణ ఉత్సవాలు'.. కళాకారులను అభినందించిన ప్రముఖులు**



**మాదాపూర్ విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. సృజన కల్చరల్ అండ్ లిటరరీ ఆర్గనైజేషన్ చైర్మన్ అంజనా చౌదరి ఆధ్వర్యంలో శిల్పారామం యంపీ థియేటర్‌లో రెండు రోజుల పాటు 'తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల'ను నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన శాస్త్రీయ, జానపద నృత్య రూపాలు ప్రేక్షకులను అలరించాయి.డాక్టర్ మైథిలి అనూప్ బృందం మోహినియాట్టం, అర్చన మిశ్ర బృందం కథక్, వైదేహి సుభాష్‌బృందం భరతనాట్యం, దింపే బైస్య సత్రియా నృత్యం, సౌమ్య బైనిక్ గౌడీయ నృత్యం, అర్పిత పాణి బృందం ఒడిసి, టెక్రామ్ వర్మ బృందం బైగా నృత్యం, శ్రోభన మిశ్రా మణిపురి నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐపీఎస్ అధికారి సౌమ్య మిశ్రా, స్పెషల్ ప్రిన్సిపాల్ సెక్రటరీ, కల్చర్ అండ్ టూరిజం శాఖ ఐఏఎస్ అధికారి వాణి ప్రసాద్, మేడ్చల్ మల్కాజిగిరి డిప్యూటీ కలెక్టర్ చంద్రావతి కళాకారులను అభినందించారు. తెలంగాణ సంస్కృతి, కళల వికాసానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు.శిల్పారామంలో రెండు రోజుల పాటు కొనసాగే ఈ అవతరణ ఉత్సవాలకు కళాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



**సికింద్రాబాద్, విశాలభారతి :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజాంపేట్ హనుమాన్ టెంపుల్ దగ్గర ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం బిజెపి నిజాంపేట్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆనాడు తెలంగాణ కోసం అమరులైన తెలంగాణ ఉద్యమకారుల గురించి వివరిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా నాయక శిల్పారెడ్డి ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా విచ్చేసి మహిళల గురించి వాళ్ళ అభివృద్ధి గురించి మాట్లాడడం జరిగింది దాసి నాగరాజు, సుమన్ రావు పి వెంకటేశ్వర ముదిరాజ్, చక్రధర్, మల్లేష్ గౌడ్, పాండు, రాజేష్ ముదిరాజ్, అనేకమంది బిజెపి కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## మధ్యతరగతి ప్రజలపై విపరీతమైన బారాలు





- పేద మధ్యతరగతి ప్రజల పిల్లలను చదివించుకోలేని స్థితి
- పెదప్రజల కోసం నిరంతర పోరాటాలు కొనసాగిస్తాము
- వ్యవసాయ కార్మిక సంఘం 11 మందితో నూతన మండల కమిటీని ఎన్నిక
- మండలాధ్యక్షులుగా కడియం సత్యం
- మండల ప్రధాన కార్యదర్శిగా గందసిరి శ్రీనివాస్
- మండల ఉపాధ్యక్షులుగా గొల్లపల్లి కృష్ణ
- మండల సహాయ కార్యదర్శిగా గండమల్ల రోశయ్య

**కురవి విశాలభారతి:**

కురవి మండల కేంద్రంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో నూతన కమిటీ 11 మందితో మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా కడియం సత్యం, మండల ప్రధాన కార్యదర్శిగా గంద శ్రీ శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులుగా గొల్లపల్లి కృష్ణ, మండల సహాయ కార్యదర్శిగా గండమల్ల రోశయ్య, మండల కోశాధికారిగా డప్పు సుమన్, మండల కమిటీ సభ్యులుగా కట్ల కృష్ణయ్య, భానోతు దేవ, శనిగ పురపు వెంకన్న, కూంద్రి ఎల్లయ్య, కోఆప్షన్ సభ్యులుగా ముగ్గురిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గంధసిరి శ్రీనివాస్ మాట్లాడుతూ... పెద్ద పెద్ద సంపన్నులకు లక్షల కోట్లు మాఫీ చేస్తున్న ఈ ప్రభుత్వాలు లేదా మధ్యతరగతి ప్రజలపై డీజిల్ పెట్రోల్ నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెంచి విపరీతమైన బారాలు వేస్తున్నాయని ఆరోపించారు.పేద మధ్యతరగతి ప్రజల పిల్లలను చదివించుకోలేని స్థితిలో ఉన్నారని అదేవిధంగా ఎలాంటి జబ్బులు వచ్చినా హాస్పిటల్లో వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో ఉన్నారని విద్య,వైద్యం వారికి ఉచితంగా అందించే వరకు నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలు మహిళలకు నెలకు 2500 ఇస్తానన్నారు., ఇందిరమ్మ ఇల్లు ప్రతి ఒక్కరికి ఇస్తానన్నారు., వారికి ఇచ్చే వరకు నిరంతర పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఉపాధి హామీ రోజుకు 600 రూపాయలు గడ్డపారలు పారులు బోచ్చలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించే వరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. రేపు అనగా మూడో తారీకు జూన్ కేసముద్రంలో జరుగు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం కురవి మండల మహాసభ లో వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శి గా గండమల్ల రోశయ్య ని ఎన్నికైనారు వారికి జిల్లా కమిటీ నుంచి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెపినారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం త్యాగాల ఫలితం



- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**విశాలభారతి గోదావరిఖని:**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజలకు ,కార్యాలయ అధికారులకు, సిబ్బందికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం మనందరికీ గర్వకారణమైన రోజు అని అన్నారు.ఈ రాష్ట్ర సాధన కోసం ఎందరో చేసిన త్యాగాలు, పోరాటాలు, అంకితభావం ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటూ,రాష్ట్ర సాధన వెనుక ఉన్న మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించబడిందని తెలిపారు. వ్యవసాయం,విద్య, వైద్యం,మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు తదితర రంగాల్లో రాష్ట్రం ముందడుగు వేసిందన్నారు.ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు సామాజిక సామరస్యం, శాంతిభద్రతలు కూడా బలోపేతమయ్యాయని పేర్కొన్నారు.రాష్ట్ర అభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని,ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి కష్టపడి పనిచేసినప్పుడే రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తుందని అన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజలు,అధికారులు, ఉద్యోగులు అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసు శాఖ గత మూడు దశాబ్దాలుగా ఎంతో అంకితభావంతో పనిచేస్తోందన్నారు. ఒకప్పుడు సమస్యాత్మక ప్రాంతాలుగా భావించిన అనేక ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొన్నదని తెలిపారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా పగలు,రాత్రి స్వేచ్ఛగా సంచరించే పరిస్థితులు ఏర్పడ్డాయని,ఇది పోలీసు శాఖ నిరంతర కృషి ఫలితమని పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.అవినీతి, నిర్లక్ష్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వకుండా పారదర్శకంగా విధులు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల భద్రత,సంక్షేమం కోసం 24/7 అందుబాటులో ఉంటూ సేవలందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని అన్నారు.విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సేవా పతకాలను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ రమేష్,మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్,ఏవో శ్రీనివాస్,ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, వివిధ విభాగాల అధికారులు, ఎస్ఐలు,సిబ్బంది, సీపీఓ సిబ్బంది, స్పెషల్ పార్టీ మరియు ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంసీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**జాతీయ పతాక ఆవిష్కరణ .. అమరవీరులకు నివాళులర్పించిన కమిషనర్ డాక్టర్**



**శేరిలింగంపల్లి విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, తెలంగాణ సాధనలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినూత్న ఆలోచనలు, ప్రజాకేంద్రిత పాలనతో తెలంగాణ దేశంలోనే అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. సైబరాబాద్‌లో మెరుగైన పౌర సేవలు, సుస్థిర అభివృద్ధి, పచ్చదనంతో కూడిన స్మార్ట్ నగర నిర్మాణానికి కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు. ఇటీవల తొలి వంద రోజుల సేవలను పూర్తిచేసుకున్న సీఎంసీ, ప్రజాభాగస్వామ్యంతో పారదర్శక పాలన ద్వారా ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తోందని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో సీఎంసీ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మియాపూర్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**జాతీయ పతాకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ**




**శేరిలింగంపల్లి విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వేడుకలు ఘనంగా జరిగాయి. పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కొండాపూర్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్, సహచర మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షా కాలం ముందే అలర్ట్

- ముంపు ప్రాంతాల్లో అధికారుల తనిఖీ .. డ్రైనేజీలు, చెరువుల పనులు వేగవంతం..
- ప్రజల సహకారం కోరిన కమిషనర్లు





**శేరిలింగంపల్లి విశాల భారతి:** వర్షాకాలం సమీపిస్తుండటంతో సైబరాబాద్‌లో ముంపు నివారణ చర్యలు ఊపందుకున్నాయి. మున్సిపల్ కమిషనర్, పోలీస్ కమిషనర్ సంయుక్తంగా ముంపు బాధిత ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు.ఖాజాగూడ చెరువు, మల్కం చెరువు, కొండాపూర్, గచ్చిబౌలి, హెచ్‌సీయూ పరిసరాల్లో డ్రైనేజీ లైన్లను, చెరువుల ఆయకట్టును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూడిక తొలగింపు, డీసిల్టింగ్, మురుగు కాలువల శుభ్రత, లోతట్టు ప్రాంతాల్లో కొత్త పంప్ సెట్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.వర్షాల సమయంలో ట్రాఫిక్, ముంపు సమస్యలు రాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. డ్రైనేజీలు మూసుకుపోకుండా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయవద్దని ప్రజలకు సూచించారు.ఈ తనిఖీల్లో ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగమే తెలంగాణ రాష్ట్రం

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారాసిగూడ చౌరస్తా, పార్సిగుట్ట చౌరస్తాలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయిప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. జెండా ఆవిష్కరణ అనంతరం కార్యకర్తలు, ప్రజలు వందేమాతరం, జనగణమన గీతాలాపన చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ చరిత్రను వివరించారు. మలిదశ ఉద్యమంలో హైదరాబాద్‌లో జరిగిన లాఠీఛార్జీలు, అరెస్టులు, రైలు రోకోలు, మిలియన్ మార్చ్, సాగరహారం వంటి ఉద్యమ ఘట్టాలను గుర్తుచేశారు. ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా జరిగిన పోరాటాలు, విద్యార్థులపై జరిగిన హింసాత్మక ఘటనలు, అమరవీరుల బలిదానాలు తెలంగాణ ప్రజల తెగువకు నిదర్శనమని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పార్లమెంట్‌లో బీజేపీ బేషరతుగా మద్దతు ఇచ్చిందని, అప్పటి యూపీఏ ప్రభుత్వం తాత్సారం చేస్తున్న సమయంలో బీజేపీ ఒత్తిడితోనే తెలంగాణ బిల్లు పాస్ అయిందని స్వరూప గౌడ్ స్పష్టం చేశారు. తెలంగాణ సాకారంలో బీజేపీ పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని తెలిపారు.ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యసాధనకు, అవినీతి రహిత పాలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ సీనియర్ నాయకులు రవి ప్రసాద్ గౌడ్, కుమార్, సంపత్, కొమరయ్య, అరవింద్, శ్రీశైలం, బిక్షపతి, భాస్కర్ గౌడ్, వెంకట చైతన్య, గంజి నవీన్, జయంత్,రాజ్ కుమార్ నేత, సుధాకర్, సినిమా రాజు, సోమ అశోక్, వెంకటేష్, ప్రమోద్,కృష్ణ మాదిగ, జ్ఞానేశ్వర్, గజరాజు పాల్,బాలయ్య, రవి, సరిత, సుశీల, రమ, వీణ, నాగమణి,సోను, ఉమేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దాల పోరాట ఫలమే తెలంగాణ: వల్లారపు శ్రీనివాస్



**సికింద్రాబాద్, విశాలభారతి :** దశాబ్దాల పోరాట ఫలమే తెలంగాణ అని తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిలకలగూడలోని గాంధీ విగ్రహం వద్ద తెదేపా సీతాఫలమండీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణ ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. 60 సంవత్సరాల పోరాటం తరువాత సిద్ధించినదే తెలంగాణ అని, తెలంగాణని సాధించడానికి శ్రీకాంత చారి మొదలుకొని వందల మంది బలిదానంతో తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అయినా అమరవీరుల కుటుంబాలను ఆదుకొనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలుగుదేశం పార్టీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నామ్ అన్నారు.

# తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల పాత్ర కీలకం

- సీపీ డా. ఎం. రమేష్
- ప్రజల భద్రతే అభివృద్ధికి పునాది
- ఉత్తమ సేవలందించిన సిబ్బందికి పతకాల ప్రదానం
- సైబరాబాద్ కమిషనరేట్‌లో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

సైబరాబాద్ - విశాల భారతి





తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, భద్రతలో పోలీసుల పాత్ర కీలకమని, దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ పేర్కొన్నారు. ప్రజల భద్రతే అభివృద్ధికి పునాది అని స్పష్టం చేశారు.పన్నెండవ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ డా. రమేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతాన్ని ఆలపించారు.

**త్యాగాల ఫలితం తెలంగాణ..**

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెండు వేల పద్నాలుగు జూన్ రెండున ఇరవై తొమ్మిదవ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ నేడు నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వేదికగా నిలిచిందన్నారు.

**దేశానికి ఆదర్శంగా సైబరాబాద్..**

ఆర్థికాభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పనలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. గత పదేళ్లలో జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లో తెలంగాణ పోలీసులు విజేతలుగా నిలవడం రాష్ట్ర శాఖ ప్రతిభకు నిదర్శనమన్నారు. ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, తయారీ పరిశ్రమలు, విమానాశ్రయం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మెట్రో రైలు, ఫ్లైఓవర్లు వంటి ప్రాజెక్టులతో సైబరాబాద్ దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా మారిందని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వస్తున్న ప్రజలకు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యత అని, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే మెరుగైన సేవలు అందించగలమని సూచించారు.

**మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం**

హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్, తలసరి ఆదాయం వంటి సూచీల్లో తెలంగాణ సాధిస్తున్న ప్రగతి గర్వకారణమన్నారు. రెండు వేల నలభై ఏడు నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని తెలిపారు. బలిమెల ఘటనలో అమరులైన పోలీసు కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు.

**పతకాల ప్రదానం.. చిన్నారులకు బహుమతులు**

విధి నిర్వహణలో విశిష్ట ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి మహోన్నత సేవా పతకాలు, ఉత్తమ సేవా పతకాలు, సేవా పతకాలను సీపీ చేతుల మీదుగా ప్రదానం చేశారు. మహోన్నత సేవా పతకానికి అదనపు డీసీపీ ఎస్. రవికుమార్, ఆర్ఎస్ఐ జి. అశోక్ ఎంపికయ్యారు. ఉత్తమ సేవా పతకాలకు ఎస్సైలు కె. శ్రీనివాస్, ఎస్. రాంబాబు, మహ్మద్ హాజీ మియా, ఏఆర్ఎస్సై కృష్ణ నరేడ్ల, ఏఎస్సై వి. వెంకట సూర్యనారాయణ రాజు ఎంపికయ్యారు. సేవా పతకాలకు మరో ముప్పై ఏడు మంది అధికారులు, సిబ్బంది ఎంపికయ్యారు. హైదరాబాద్ జిల్లా మహిళా మండల సమాఖ్య ప్రధాన కార్యదర్శి షహీన్ అఫ్రోజ్ ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమం, అనాథాశ్రమానికి చెందిన ఇరవై ఎనిమిది మంది చిన్నారులు, సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులకు సీపీ బహుమతులు అందజేశారు. తెలంగాణ సాధనలో అమరవీరుల త్యాగాలను షహీన్ అఫ్రోజ్ స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో డీసీపీలు ఎన్. కోటి రెడ్డి, టి. అన్నపూర్ణ, సి.హెచ్. శ్రీనివాస్, రితిరాజ్, ముత్యం రెడ్డి, వై.వి.ఎస్. సుధీంద్ర, సృజన కరణం, టి. సాయి మనోహర్, శోభన్ కుమార్, సంజీవ్ తదితర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మొయినాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొయినాబాద్ మండలంలోని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వివిధ రాజకీయ, సామాజిక సంస్థల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్ మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రం సాధన కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల సేవలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని వెంకటాపూర్, కాశింబౌలి, నక్కలపల్లి, చందానగర్, కనకమామిడి, తోల్కట్ట, హిమాయత్‌నగర్ తదితర గ్రామాల్లో సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ఆవిష్కరించి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల ప్రదర్శనలు, మొక్కల నాటకం, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నాయకులు ప్రసంగించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, యువత, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమాలు ఉత్సాహంగా ముగిశాయి.

## జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

**ఉత్తమ ప్రతిభ చూపిన సిబ్బందికి నగదు పురస్కారాలు.. అందరికీ పాస్‌పోర్టులు అందజేత**





**సైబరాబాద్ విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ జాతీయ జెండాను ఆవిష్కరించి సిబ్బందితో కలిసి జాతీయ గీతం, రాష్ట్ర గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నో ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ అభివృద్ధిలో పోలీసులు కీలక పాత్ర పోషించాలన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. పెట్టుబడులు ఆకర్షించాలంటే శాంతిభద్రతలు అత్యుత్తమ స్థాయిలో ఉండాలని, హోంగార్డు నుంచి అధికారుల వరకు అందరూ కృషి చేయాలని కోరారు.విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది సిబ్బందికి నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఘట్టంగా స్టేషన్‌లో పనిచేస్తున్న ప్రతి ఒక్క సిబ్బందికీ ఇండియన్ పాస్‌పోర్ట్ దరఖాస్తు చేయించి, వచ్చిన పాస్‌పోర్టులను సోమవారం అందరికీ అందజేశారు. సిబ్బంది సంక్షేమంలో జీడిమెట్ల పోలీస్ ముందుంటుందని, టీమ్‌వర్క్‌తో సమాజ సేవ చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ వేడుకల్లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ్, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పండుగ వాతావరణంలో ముస్తాబైంది. కార్యాలయ ప్రాంగణం మొత్తం జాతీయ జెండాలతో, పూలతో అలంకరించబడగా, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతం ఆలపించగా అక్కడి వాతావరణం దేశభక్తి భావాలతో మార్మోగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. వారి త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నానని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారికి స్వీట్లు పంచిపెట్టారు. మొత్తంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు రాజేంద్రనగర్‌లో ఉత్సాహభరితంగా, ఘనంగా జరగడం విశేషం.

## పండ్ల మార్కెట్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జాతీయ జెండాను ఆవిష్కరించిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాటసింగారం పండ్ల మార్కెట్‌లో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. అమరుల ఆశయాలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ చేరేలా కృషి చేయాలని కోరారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొంటూ, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు మేకం లక్ష్మి, అంజయ్య, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, బండి మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్కెట్ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## తెలంగాణ అమరవీరులకు జోహార్లు

**రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు**

**సికింద్రాబాద్, విశాలభారతి :** బౌద్ధనగర్ డివిజన్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం బౌద్ధనగర్ డివిజన్‌లో డివిజన్ నాయకులతో కలిసి కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్షకిరణ్ మువ్వన్నెల జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మేకల కీర్తిహర్షకిరణ్ మాట్లాడుతూ.. నేడు మనం చూస్తున్న తెలంగాణ రాష్ట్రం ఎందరో అమరవీరుల త్యాగఫలమని, వారి బలిదానాలను మనం ఎప్పటికీ మర్చిపోవద్దని తెలిపారు. అమరుల ఆశయ సాధన కోసం మనమంతా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, నాడు పార్లమెంట్‌లో దేశం చూపు మొత్తం మన తెలంగాణ వైపు తిరిగేలా ప్రసంగించి, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన తెలంగాణ చిన్నమ్మ సుష్మా స్వరాజ్ చారిత్రాత్మక కృషి చిరస్మరణీయమని , ఈ తెలంగాణ గడ్డ వారిని ఎన్నటికీ మరువదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొమ్రయ్య, మూల అరవింద్, శ్యామ్ రాజ్, వనమాల శ్రీనివాస్, భిక్షపతి,సాయి ముదిరాజ్, యాదమ్మ, బాలయ్య, క్రాంతి, సతీష్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.



## చిన్నగూడూరులో జాతీయ జెండాకు అవమానం

- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో నిర్లక్ష్యం వెలుగులోకి
- మండల పరిషత్ కార్యాలయంలో క్రిందకు జారిన త్రివర్ణ పతాకం
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో నిర్లక్ష్యం బట్టబయలు
- జెండా ఎగురవేత ఏర్పాట్లపై ప్రశ్నలు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- దేశ గౌరవ చిహ్నం విషయంలో అధికారుల అలసత్వం
- చిన్నగూడూరు ఎంపీపీ కార్యాలయంలో వివాదాస్పద ఘటన

మహబూబాబాద్ విశాలభారతి:




తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా క్రిందికి జారిపోవడం వివాదాస్పదంగా మారింది. రాష్ట్ర అవతరణ వేడుకల రోజున జాతీయ పతాకం సక్రమంగా ఎగురవేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పలువురు విమర్శిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయ భవనంపై ఆవిష్కరించిన జాతీయ జెండా కొంతసేపటికే క్రిందికి జారిపోవడంతో అక్కడికి వచ్చిన ప్రజలు, స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జాతీయ జెండా గౌరవాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ కార్యాలయంలోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది. జాతీయ పతాకాన్ని ఎగురవేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, ఏర్పాట్లలో నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దేశ గౌరవానికి ప్రతీక అయిన జాతీయ జెండా విషయంలో అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అమరుల స్ఫూర్తితో ఉద్యమ ఆకాంక్షలకనుగుణంగా పాలన



- సబ్బండ వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకల్లో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు,ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్, జూన్ 2:**

తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల స్ఫూర్తితో, ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన



రాష్ట్రావతరణ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ పీ. నారాయణరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన కార్యక్రమంలో హాజరయ్యారు. అనంతరం వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను మంత్రితో కలిసి పరిశీలించి అధికారులను అభినందించారు.తదనంతరం ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. కార్యాలయ భవనంపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వెనుక ఉన్న అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. ఆనాడు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ సంకల్పంతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ పునర్నిర్మాణం వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమం, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకుని అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జనగణనలో సాంకేతిక సమస్యలకు పరిష్కారం

- తాళం వేసిన ఇళ్ల వెరిఫికేషన్ షురూ
- సర్వే చేసిన ఇళ్ల మ్యాప్‌లను పరిశీలిస్తున్న అధికారులు



**సైబరాబాద్ విశాల భారతి:** నగరంలో కొనసాగుతున్న జనగణన పనులను వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అల్విన్ కాలనీ సర్కిల్ 51 కార్యక్రమంలో భాగంగా జనగణన పురోగతిపై సమీక్ష సర్కిల్ ఉప కమిషనర్ ఈ చాముండేశ్వరి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఫీల్డ్‌లో సిబ్బందికి ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. యాప్ లాగిన్, డేటా సింక్ కాకపోవడం, జీపీఎస్ ట్యాగింగ్‌లో వస్తున్న లోపాలను టెక్నికల్ టీమ్‌తో కలిసి సరిచేస్తున్నారు.తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రెండోసారి సందర్శించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే సర్వే పూర్తయిన ఇళ్ల మ్యాప్‌లను అధికారులు పరిశీలించి, ఏరియా వారీగా పెండింగ్ ఇళ్ల జాబితా తయారుచేస్తున్నారు. ఒక్క ఇంటినీ వదలకుండా వంద శాతం జనగణన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఈ సమీక్షలో సంబంధిత విభాగం అధికారులు,సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు,డేటా ఎంట్రీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్‌గా కొత్తపల్లి చంద్రశేఖర్

- నూతన మేనేజర్‌కు ఘన స్వాగతం పలికిన అడ్వైజర్లు
- సత్తుపల్లి బ్రాంచ్‌లో విధుల్లో చేరిన కొత్తపల్లి చంద్రశేఖర్
- ప్రజల ఆదాయ స్థాయికి అనుగుణంగా పాలసీలు సూచించాలని పిలుపు
- సేవా దృక్పథంతో పనిచేయాలని అడ్వైజర్లకు సూచన



**విశాలభారతి , సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసిన చలమాల సాంబయ్య గత నెల 31న భద్రాచలానికి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆ స్థానంలో హైదరాబాద్ బాలానగర్ బ్రాంచ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న కొత్తపల్లి చంద్రశేఖర్‌ను బదిలీ చేయగా, ఆయన సోమవారం విధుల్లో చేరారు.ఈ విషయం తెలుసుకున్న ఏజెన్సీ మేనేజర్ (ఏఎం) తుంగల నాగరాజు బృందంలోని అడ్వైజర్లు మంగళవారం బ్రాంచ్‌ను సందర్శించి కొత్తపల్లి చంద్రశేఖర్‌కు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.అనంతరం నిర్వహించిన అడ్వైజర్ల అవగాహన సదస్సులో కొత్తపల్లి చంద్రశేఖర్ మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఒక కుటుంబం వద్దకు వెళ్లిన సమయంలో వారి హ్యూమన్ లైఫ్ వాల్యూను అంచనా వేసి, దానికి అనుగుణంగా ఇన్సూరెన్స్ పాలసీలు సూచించాలని అడ్వైజర్లకు సూచించారు.ఈ నెల 5న జరగనున్న “వీర తెలంగాణ విజయ గర్జన” మెగా లాగిన్ డేను పురస్కరించుకుని, బీమా లేని కుటుంబాలకు బీమా పాలసీలు చేర్చి వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు అడ్వైజర్లు కృషి చేయాలని కోరారు. సేవా దృక్పథంతో పని చేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్ తుంగల నాగరాజు, అడ్వైజర్లు మల్లూరు చంద్రశేఖర్, మరికంటి నందిని, పేర్ల సత్యం, గుంజి రాంబాబు, సరభు శివనాథ్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## ఏఈఓ సేవలు మరువలేనివి: నూకారపు బిక్షమయ్య

**అశ్వాపురం, విశాలభారతి :** మండలంలోని వ్యవసాయ శాఖలో విస్తరణ అధికారిగా పనిచేసిన దూదిమెట్ల రమాదేవి సేవలు మరువలేనివని ఎరువులు పురుగుమందుల షాపుల డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు నూకారపు భిక్షమయ్య అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని రైతు వేదికలో ఆమెకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తొలుత ఆమెకు శాలువాలు కప్పి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులకు గత రెండున్నర సంవత్సరాలుగా వ్యవసాయంలో అనేక మెలుకువలు అందించి బదిలీపై వెళుతున్న ఏఈఓ ను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఆమె సేవలు మండలానికి ఎంతో అవసరం ఉన్నప్పటికీ ఉద్యోగరీత్యా బదిలీలు కావడం సాధారణమని, ఆమె లేని లోటు రైతులకు లేకపోలేదు అన్నారు. రైతుకు మేలు చేకూర్చాలనే ఆలోచన, నిబద్ధత తో పనిచేసే అధికారులు అరుదుగా వస్తుంటారని వారి సేవలను గుర్తించి వారిని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యతని అందులో భాగంగానే ఏఈఓ ని గౌరవంగా సన్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. మండలానికి నూతనంగా వచ్చే ఏ ఈ ఓ లు కూడా రైతులకు మెరుగైన సేవలు అందించి మంచి అధికారులుగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏవో మహేష్ చంద్ర చటర్జీ, నూతన ఏఈవోలు కొమరం ప్రశాంత్, రమేష్, పురుగుమందు షాపుల డీలర్లు సోమ వెంకటరెడ్డి, నేలపట్ల కోటి రామిరెడ్డి, శావా జగదీష్, సంజీవ్ నాయక్, సిహెచ్ వి ప్రసాద్, వేణు రెడ్డి, ధారావత్ రమేష్, ఎం నాగరాజు, హర్ష నాయక్ పాల్గొన్నారు.



# ఆడబిడ్డల నవ్వుల్లో ఆనందం... పేదల గడపల్లో సొంతింటి వెలుగులు

- ఇందిరమ్మ ఇళ్లతో నెరవేరిన వేలాది కుటుంబాల కలలు
- లష్కర్‌గూడ, గండిచెరువులో ఘనంగా గృహప్రవేశాలు – లబ్ధిదారులతో కలిసి సంబరాల్లో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- పేదల ముఖాల్లో కనిపిస్తున్న చిరునవ్వే నా అసలైన విజయం – ఎమ్మెల్యే





**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్, జూన్ 2:**

దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో, తాత్కాలిక నివాసాల్లో జీవనం సాగించిన వేలాది పేద కుటుంబాల సొంతింటి కలలు నేడు నిజమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన గృహాల్లో అడుగుపెట్టిన లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో తొలి విడతలో మంజూరైన ఇళ్ల గృహప్రవేశాలు సోమవారం పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగాయి. నియోజకవర్గంలో మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అర్హుల ఎంపిక నుంచి నిర్మాణాల పూర్తివరకు ప్రతి దశను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన గృహప్రవేశ కార్యక్రమాల్లో భాగంగా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని లష్కర్‌గూడ మరియు గండిచెరువు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొత్త ఇళ్లను రంగురంగుల తోరణాలు, పూలమాలలతో అలంకరించిన లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య గృహప్రవేశాలు నిర్వహించారు. తమ ఇంటి గడపకు అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి గృహాలను ప్రారంభించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటి గడప దాటిన ఆనందంలో పలువురు లబ్ధిదారులు భావోద్వేగానికి గురయ్యారు. జీవితంలో ఎప్పుడైనా సొంతింటిలో నివసిస్తామా అనుకున్నాం. కానీ నేడు మా కల నిజమైంది అంటూ ఆనందభాష్పాలు కార్చారు. తమకు గౌరవప్రదమైన జీవితం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో విజయం సాధించిన రోజు కంటే పేదల ముఖాల్లో సంతోషాన్ని చూసిన ఈ రోజే తనకు నిజమైన విజయమని అన్నారు. ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదని, ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై భరోసా కల్పించే జీవనాధారమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన తెలిపారు. తొలి విడతలో అవకాశం పొందని అర్హులందరినీ గుర్తించి రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజలను మోసపూరిత హామీలతో మభ్యపెట్టే రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలతో లష్కర్‌గూడ, గండిచెరువు గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొనగా, లబ్ధిదారుల కుటుంబాల ఆనందం వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్ ఎంపిడిఓ శ్రీవాణి, యం పి ఓ తుల్జా ప్రసాద్ లష్కర్ గూడా గ్రామ సర్పంచ్ అల్లే ఐలయ్య యాదవ్, గండి చెరువు సర్పంచ్ రవీందర్ రెడ్డి, అబ్దుల్లాపూర్మెట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బింగి దేవదాస్ గౌడ్, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, వివిధ గ్రామాల సర్పంచ్ లు కోట ప్రభాకర్ రెడ్డి, కొలను లక్ష్మి ప్రసన్న రవీందర్ రెడ్డి, అంతటి హేమలత జంగయ్య గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నార్సింగి డిప్యూటీ కమిషనర్ బదిలీపై చర్చలు

**పోస్టు కోసం జోరుగా పైరవీలు**




**రాజేంద్రనగర్, విశాలభారతి :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి బదిలీ కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసి, జాయింట్ డైరెక్టర్ హోదాలో ఉన్న ఆయనను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) కార్యాలయానికి బదిలీ చేసింది. కృష్ణమోహన్ రెడ్డి గతంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్‌గా సుదీర్ఘకాలం సేవలందించారు. అనంతరం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు తర్వాత నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా కొనసాగుతూ పరిపాలనలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆయన మున్సిపల్ కమిషనర్ల రాష్ట్ర అధ్యక్షుడిగానూ వ్యవహరిస్తున్నారు. ఇంత అనుభవం కలిగిన అధికారిని బదిలీ చేయడం స్థానిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

**హాట్ కేక్‌గా మారిన పోస్టు**

నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పదవి ప్రస్తుతం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఈ పోస్టును దక్కించుకునేందుకు అధికారులు పెద్ద ఎత్తున పైరవీలు ప్రారంభించినట్లు సమాచారం. కొందరు అధికారులు భారీగా ఖర్చు పెట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ప్రభుత్వ పెద్దలతో పలువురు లాబీయింగ్ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

**విస్తారమైన పరిధి – ఆదాయ వనరులు**

నార్సింగి సర్కిల్ పరిధి విస్తారంగా ఉండటంతో పాటు ఐదు డివిజన్లు ఇందులో ఉన్నాయి. జన్వాడ, మీర్జాగూడ, గౌలిదొడ్డి, వట్టినాగులపల్లి వంటి ప్రాంతాలు 111 జీఓ పరిధిలోకి వస్తాయి. ఈ ప్రాంతాల్లో నిర్మాణ కార్యకలాపాలు వేగంగా కొనసాగుతుండటంతో మున్సిపల్ అధికారులకు ఇది కీలకమైన పరిధిగా భావిస్తున్నారు. అదనంగా, గతంలో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలుగా ఉన్న ఈ ప్రాంతాల్లో అనేక అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ కారణాల వల్లే ఈ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పదవిని దక్కించుకోవడానికి అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

# డంపింగ్ యార్డ్‌తో గ్రామ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది

- చిన్న రావిరాల గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజలకు అవగాహన కార్యక్రమం
- వాయు, నీటి, భూమి కాలుష్యంతో పాటు వ్యాధుల వ్యాప్తిపై ఆందోళన
- డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తుల నినాదాలు




**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్, జూన్ 2:** చిన్న రావిరాల గ్రామంలో ప్రతిపాదిత ఈకో టౌన్ (డంపింగ్ యార్డ్) వల్ల కలిగే నష్టాలు, భవిష్యత్తులో పొంచి ఉన్న ప్రమాదాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో గ్రామ ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.డంపింగ్ యార్డ్ వల్ల వాయు కాలుష్యం పెరిగి గాలి కలుషితమవుతుందని, నీటి వనరులు కాలుష్యానికి గురవుతాయని, భూమి సారవంతత దెబ్బతిని వ్యవసాయ పంటలు ఆశించిన స్థాయిలో పండే అవకాశాలు తగ్గిపోతాయని వివరించారు. అదేవిధంగా చెత్త నిల్వల కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి వివిధ రకాల అంటువ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. గ్రామాల ఐక్యత, ప్రజల సంక్షేమం కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై రాజకీయ విమర్శలకు బదులుగా గ్రామాభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.అనంతరం గ్రామస్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని "డంపింగ్ యార్డ్ వద్దు – గ్రామాన్ని కాపాడాలి" అంటూ నినాదాలు చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను విరమించుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సత్తుపల్లి శిరీష శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు బండారు అనిత, ఆకిటి రామకృష్ణారెడ్డి, అభవతిని బాలయ్య, నారెడ్డి రిషిత, సతీష్ రెడ్డి, రాపోలు మల్లేష్, బండారి సత్యనారాయణ, చెరుకు భాగ్యలక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ నీరునేముల కిష్టయ్య, కళ్లెం శ్రీధర్ రెడ్డి, కళ్లెం లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఏర్పాటులో ఉద్యోగుల పాత్ర కీలకమైంది

- తహశిల్దార్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భవ దినోత్సవం
- జెండా ఆవిష్కరించిన తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు
- త్యాగాల తెలంగాణకు అభివందనం తెలిపిన తాహ సిల్దార్
- ఉద్యోగుల గొంతుకైన వేళ తెలంగాణ ఏర్పాటు వాదం



**భద్రాచలం , విశాలభారతి:** భద్రాచలం తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి ముందుగా తహసిల్దార్ జెండా ఆవిష్కరించి అభివాదం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు కోసం తొలి దశ, మలిదశ ఉద్యమాలు కీలకమైన వని ఆయన క పేర్కొన్నారు. అనేకమంది బలి దానాలతో తెలంగాణ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని వారికి ప్రత్యేకమైన నివాళులు అర్పిస్తున్నామని ఆయన తెలిపారు. వారి కుటుంబాలను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని ఆయన అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు వాదం లో విద్యార్థులు, యువకులు, శ్రామికులు ,రైతులు ,కూలీలు ప్రజా కళాకారులు వారి గొంతుకలో ఒక బలమైన ప్రత్యేక తెలంగాణ వాదాన్ని బుజ స్కందాల పైన మోసారని కొందరు తమ ప్రాణాలను తునప్రాయంగా అర్పించిన ఘనమైన చరిత కలిగిన ప్రత్యేక తెలంగాణ అని ఆయన అన్నారు. అందులో ఉద్యోగులు కూడా తమదైన పాత్ర పోషించారని విధులను బహిష్కరించి వంటావార్పులతో ప్రత్యేక తెలంగాణ కోసం రోడ్ల పైన పెద్ద ఎత్తున బార్లు తీరి తమ వంతు పాత్ర పోషించారని నీళ్లు,నిధులు, నియామకాలు ప్రత్యేక పరిపాలన వంటి అంశాల పైన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తొలిదశ ,మలిదశ ఉద్యమాలు కీలకమైన ఉద్యమంగా చెప్పబడ్డాయని ఆయన కొనియాడారు. అనేక త్యాగాల రిత్య ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు జరిగిందని ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న అందుకు ఆనందంగా ఉందని తెలంగాణ ప్రజలకు ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నానని తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రగతికి పక్షవాతం

- పెండింగ్ పనులను కూడా పూర్తి చేయలేకపోతున్న ప్రభుత్వం
- అసంపూర్తి రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న ఆవేదన
- వెంటనే పనులు పూర్తి చేయకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిక

**విశాలభారతి, అశ్వారావుపేట :**

బిఆర్ఎస్ పదేళ్ల హయాంలో పరుగులు పెట్టిన అభివృద్ధి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనంతో పక్షవాతం వచ్చినట్లు ఎక్కడికక్కడ కుంటుపడిపోయిందని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వర రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. కనీసం గత ప్రభుత్వం మంజూరు చేసిన పెండింగ్ పనులను కూడా పూర్తిచేయలేని దయనీయ స్థితిలో కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దమ్మపేట మండలంలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన రోడ్డు పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. కొత్త పనులు తీసుకురావడం చేతకాని ఈ ప్రభుత్వం, పాత పనులను సైతం గాలికి వదిలేసిందని మండిపడ్డారు.




రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు వేదికలెక్కి గొప్పలు చెప్పుకోవడం కాదని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనుల గురించి కాంగ్రెస్ నాయకులు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు.పదేళ్ల పాటు బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధికి, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన పనులకు ఈ రోడ్లే సజీవ సాక్ష్యాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి పెండింగ్ పనులను పూర్తి చేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం తప్పదని హెచ్చరించారు.

**అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లే సాక్ష్యం:**

దమ్మపేట మండలంలో అభివృద్ధి శూన్యంగా మారిందనడానికి అసంపూర్తిగా మిగిలిపోయిన పలు రోడ్లు నిదర్శనమని పేర్కొంటూ ఈ క్రింది రోడ్లను ఉదాహరణగా చూపించారు.

1. మల్లారం రోడ్డు - గతంలో ప్రారంభమైన పనులను మధ్యలోనే నిలిపివేశారని విమర్శించారు.
2. గాంధీనగర్ - మందలపల్లి రోడ్డు - ఈ మార్గంలో పనులు ఎక్కడికక్కడ స్తంభించిపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని తెలిపారు.
3. మందలపల్లి సబ్ స్టేషన్ రోడ్డు - లోపలి వైపు వెళ్లే సబ్‌స్టేషన్ మార్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.
4. జలవాగు రోడ్డు - నిర్మాణ పనులు ముందుకు సాగక అగమ్యగోచరంగా మారాయని అన్నారు.
5. పెద్దగొల్లగూడెం - మల్కారం రోడ్డు - మధ్యలో ఉన్న 'లంక' వద్ద పనులను నిలిపివేసి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు.
6. గుత్తావారిగూడెం - గంగులగూడెం రోడ్డు - ఈ రహదారి పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**విశాలభారతి గోదావరిఖని:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని రామగుండం ఏరియా వన్ ఆధ్వర్యంలో ఉదయం జియం ఆఫీసు నందు ముఖ్య అతిధి ఆర్జీవన్ జిఎం లలిత్ కుమార్ జెండా ఎగుర వేసి తెలంగాణ వేడుకలను ప్రాంరంభించడం జరిగినది. అనంతరం ముఖ్య అతిథులు, యూనియన్ నాయకులు, అధికారులు, ఉద్యోగులు తెలంగాణ తల్లి చిత్రపటమునకు, ప్రొఫెసర్ స్వర్గీయ జయ శంకర్ సార్ మరియు అమర వీరుల చిత్ర పటాలకు, అమరవీరుల స్తూపానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించటం జరిగింది. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించి తెలంగాణ గీతాలపనతో వేడుకలను ప్రారంభించడము జరిగింది. అనంతరం కళాకారులు ఆధికారులు, ఉద్యోగులతో జిఎం కార్యాలయం జ్యోతి ప్రజ్వళన చేసి పచ్చా జెండా ఊపి తెలంగాణ ర్యాలిని జియం ప్రారంభించడం జరిగినది. ఈ తెలంగాణ ర్యాలి జిఎం కార్యాలయం వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహాము వరకు కొనసాగించడం. జరిగింది.ఆర్ జి వన్ జియం మరియు అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. "తెలంగాణ రన్" లో వివిధ సాంస్కృతిక కళాకారులు నృత్య కళకారులు, భవాని పోతురాజుల వేషాలు, మహిళల డప్పు చప్పుళ్ళు, బోనాలు, కోలాటం, బతుకమ్మలు, డిజే సౌండ్ సిస్టంతో నృత్యాలు చేస్తూ వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి సమ్మర్ కోచింగ్ విద్యార్థులు, అధికారులు, యూనియన్ నాయకులు, సింగరేణి సేవా సమితి సభ్యులచే వివిధ సాంప్రదాయ ప్రదాన వేడుకలు ఆకట్టుకొన్నాయి. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పోరాట ఫలితం ద్వారా సాధించిన తెలంగాణ రాష్ట్రం అని ఇది అమరవీరుల త్యాగ ఫలితమని బంగారు తెలంగాణ సాధనలో మన వంతు కర్తవ్యంగా నిర్దేశించిన లక్ష్యాల ఉత్పత్తి సాధించి బంగారు తెలంగాణకు బాటలు వేద్దాం అని తెలిపారు. ఈ తెలంగాణను మన వంతు అగ్రభాగాన నిలుపుటకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఇట్టి వేడుకలలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, సూపర్ వైజర్లు, యూనియన్ ప్రతినిధులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులు మరియు పట్టణ ప్రాంత పురజనులందరూ పాల్గొని విజయ వంతం చేయటం జరిగింది. సాయంత్రం గోదావరికళా ప్రాంగణం, జియం కాలని నందు పలు సాంస్కృతిక కళాకారులచే కార్యాక్రమాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఇందులో వివిధ రకాల స్టాల్స్ మరియు రుచికరమైన వంటకాల స్టాళ్ళను ఏర్పాటు చేయటం జరిగిందని జీఎం తెలిపారు. ఈ కార్యక్రమములో ఆర్జీ రీజియన్ క్వాలిటి జియం సుజోయ్ మజుందర్, ఏఐటియుసి జియం ఆఫీస్ ఇంచార్జ్ రాజు, యస్.ఓ.టు జియం చంద్రశేఖర్, సి.ఎం.ఓ.ఐ కార్యదర్శి కోలా మల్లేష్, ఎజియం రామ్మోహన్ రావు, ఎజియం అంజనేయులు, ప్రాజెక్ట్ అధికారి రమేష్, ఏజెంట్స్, రమేష్, చిలుక శ్రీనివాస్, అధికారులు ధనలక్ష్మి భాయి, జితేందర్ సింగ్, వరప్రసాద్, పర్సనల్ అధికారులు రవీందర్ రెడ్డి, వేణు సీనియర్ పిఒ శ్రావణ్ కుమార్, హన్మంతరావు, సెక్యురిటి అధికారి వీరారెడ్డి, పెద్ద ఎత్తున ఉద్యోగులు పారిశ్రామిక ప్రజలు అన్ని గనుల శాఖధికారులు పాల్గొన్నారు.



# 'విశాల భారతి' కథనంతో కదిలిన యంత్రాంగం

- బెల్ట్ షాపులపై పీఏసీ చైర్మన్ ఉక్కుపాదం
- అర్ధరాత్రి స్వయంగా వెళ్లి నిర్వాహకులను పట్టించిన అరేకపూడి గాంధీ
- ఎక్సైజ్ అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు



అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇంట్లోకి అర్ధరాత్రి ఎమ్మెల్యే గాంధీ తనిఖీ



అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపును సీజ్ చేసి మందు బాటిల్ స్వాధీనం చేసుకుంటున్న ఎక్సైజ్, పోలీసు అధికారులు

**శేరిలింగంపల్లి - విశాల భారతి**

నియోజకవర్గంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపుల అక్రమ మద్యం దందాపై 'విశాల భారతి' గతంలోనే వరుస కథనాలు ప్రచురించింది. ఆ కథనాలు, స్థానిక మహిళల ఫిర్యాదుల నేపథ్యంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ స్వయంగా రంగంలోకి దిగి బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపారు.

**మహిళల ఫిర్యాదుతో రంగంలోకి..**

మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయని, నకిలీ మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని స్థానిక మహిళలు పీఏసీ చైర్మన్ గాంధీకి విన్నవించారు. గతంలో 'విశాల భారతి' ఈ బెల్ట్ షాపుల అక్రమాలపై వివరంగా కథనాలు ప్రచురించినా ఎక్సైజ్ అధికారుల్లో చలనం లేదని వాపోయారు. కాలనీల్లో ప్రశాంత వాతావరణం చెడిపోతోందని, కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నాయని తెలిపారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గాంధీ ఆదివారం అర్ధరాత్రి సమయంలో స్వయంగా గోకుల్ ప్లాట్స్‌కు వెళ్లారు. అక్కడ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాప్ నిర్వాహకులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంటనే ఎక్సైజ్, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చి సంఘటనా స్థలానికి రప్పించారు. తాను స్వయంగా అక్కడే ఉండి నిర్వాహకులను అధికారులకు అప్పగించారు.

**కఠిన చర్యలు తప్పవన్న ఎమ్మెల్యే**

ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రశాంతమైన కాలనీల్లో బెల్ట్ షాపులు పెట్టి నకిలీ మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**గతంలో విశాల భారతిలో వచ్చిన వరుస కథనాలు**




**ఎక్సైజ్ అధికారులపై ఆగ్రహం**

'విశాల భారతి' కథనాలు, ప్రజల ఫిర్యాదులు వచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో కల్తీ మద్యం తాగి పద్దెనిమిది మంది వరకు మృతి చెందిన ఘటనను గుర్తుచేశారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సమంజసం కాదని హితవు పలికారు. అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారుల వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

"ప్రజల ఆరోగ్యం, భద్రత, ప్రశాంత జీవితమే నాకు ముఖ్యం. విచ్చలవిడిగా బెల్ట్ షాపులు తెరిచి పేద కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారు. ఆర్థికంగా నష్టపోవడం, ఆరోగ్యం కోల్పోవడం, ప్రాణాలు పోవడం చాలా బాధాకరం" అని ఎమ్మెల్యే గాంధీ విచారం వ్యక్తం చేశారు.

**మహిళల హర్షం.. కృతజ్ఞతలు**

'విశాల భారతి'లో వచ్చిన కథనాలకు స్పందించి, మహిళల ఫిర్యాదు మేరకు అర్ధరాత్రి స్వయంగా వచ్చి చర్యలు తీసుకున్న పీఏసీ చైర్మన్‌కు మహిళా సోదరీమణులు, కాలనీ వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో కాలనీలో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ డీఐ రమేష్ నాయుడు, ఎస్సై కృష్ణయ్య, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, స్థానిక మహిళలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నా వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూడొద్దు

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్,ప్రముఖ నటి త్రిష కృష్ణన్ గురించి గత కొంతకాలంగా సోషల్ మీడియాలో అనేక రకాల ప్రచారాలు జరుగుతున్నాయి. వీరిద్దరి మధ్య ప్రత్యేక బంధం ఉందంటూ వస్తున్న పుకార్లు అభిమానులు, నెటిజన్లలో పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా విజయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఈ రూమర్ల తీవ్రత మరింత పెరిగింది. అయితే ఈ ప్రచారాలపై అటు విజయ్ గానీ, ఇటు త్రిష గానీ ఇప్పటివరకు ప్రత్యక్షంగా స్పందించింది లేదు. కానీ తాజాగా త్రిష సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ మాత్రం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. తన వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న చర్చలకు పరోక్షంగా సమాధానం ఇచ్చినట్లుగా ఆమె పోస్టు ఉండటంతో నెటిజన్లు దానిపై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ప్రశాంతంగా నిద్రిస్తున్న తన పెంపుడు కుక్క ఫోటోను షేర్ చేసింది. ఆ ఫోటోకు జత చేసిన క్యాప్షన్ అందరి దృష్టిని ఆకర్షించింది. "నా విషయాల్లో ముక్కు పెట్టడానికి నేను అనుమతించే ఒకే ఒక్క ముక్కు ఇదే" అంటూ ఆమె రాసుకొచ్చింది. ఈ వ్యాఖ్యను చాలా మంది సోషల్ మీడియాలో తన గురించి వస్తున్న రూమర్లకు ఇచ్చిన కౌంటర్‌గా భావిస్తున్నారు. త్రిష ఎవరినీ నేరుగా ఉద్దేశించి మాట్లాడకపోయినా, తన వ్యక్తిగత జీవితంపై నిరంతరం చర్చలు చేసే వారికి ఇది గట్టి సందేశమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**విశాలభారతి గోదావరిఖని:** ఎమ్మెల్యే సహకారంతో రైజింగ్ రామగుండంగా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ. అనేక దశాబ్దాల పోరాటం, వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలు, అమరవీరుల ఆత్మబలిదానాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం వచ్చిందని అన్నారు. యు పి ఎ చైర్ పర్సన్ గా వ్యవహరించిన సోనియా గాంధీ వల్లనే తెలంగాణ రాష్ట్రం కల సాకారమైందని అన్నారు. అన్ని రంగాలలో తెలంగాణ రాష్ట్రం విశేష పురోగతి సాధిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. ముఖ్యంగా గత రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రం పారిశ్రామిక, వ్యవసాయ, విద్య, వైద్య, మౌలిక సదుపాయాలు మరియు సంక్షేమ రంగాలలో గణనీయమైన అభివృద్ధిని నమోదు చేసిందని అన్నారు. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణ, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, విద్యా ,వైద్య రంగాల బలోపేతం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడుతున్నాయని అన్నారు. రామగుండం నగరం "తెలంగాణ రైజింగ్" లక్ష్యాలకు అనుగుణంగా ఎం ఎల్ ఎల్ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆద్వర్యంలో , మంత్రి వర్యులు డి. శ్రీధర్ బాబు సంపూర్ణ సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. పాలక వర్గం వచ్చిన వంద రోజుల కాలంలో రామగుండం నగరాన్ని ఒక అందమైన పరిశుభ్ర నగరంగా, చెత్త రహిత ప్రాంతంగా తీర్చి దిద్దడానికి ప్రయత్నం ప్రారంబించడం జరిగిందని అన్నారు. ఈ ప్రయత్నంలో కార్పొరేటర్ లతో పాటు నగర పాలక సంస్థ అధికారులు సిబ్బంది చిత్త శుద్ధితో పని చేస్తున్నారని అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తెలంగాణ రాష్ట్ర అవతరణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య , కార్పొరేటర్ లు సంతోష్ రావు , దాసరి సాంబమూర్తి , సూర్య , వెంగళ బాపు , గట్ల రమేష్, రేణికుంట్ల నిర్మల , చిదురాల నాగరాజు , నెలకంటి రాము , దేవిడ్ రాజు , వడ్లూరి రవి , నాయకులు కజంపురం రాజేందర్ ,మారెల్లి రాజిరెడ్డి , కందుల సతీష్, డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి , డి ఇ ఇ లు అఫ్తాబ్ , జగదీశ్వరుడు , షాభాజ్ , నగర పాలక సంస్థ , మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ అమరుల ఆశయ లక్ష్యసాధన దిశగా అడుగులువేద్దాం

- తెలంగాణ ఫలాలు పేదల దరిచేర్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలి
- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సిపిఐ కీలక పాత్ర-- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ ముత్యాల విశ్వనాథం
- సిపిఐ పాల్వంచ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ 12వ ఆవిర్భావ దినోత్సవం



**పాల్వంచ విశాలభారతి:** తెలంగాణ అమరుల ఆశయ లక్ష్యసాధన దిశగా అడుగులువేద్దాంని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సభ్యులు ముత్యాల విశ్వనాథం పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ వద్ద తొలుత ముత్యాల విశ్వనాథం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం అరుణ పతాకాన్ని పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా ఆవిష్కరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ మేరకు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను గుర్తించి స్వరాష్ట్రంకోసం జరిగిన పోరులో అగ్రభాగాన నిలిచింది సిపిఐనేనని, ఉద్యమాన్ని తారాస్థాయికి చేర్చి ప్రజల్లో, కేంద్రంలో కదలిక తెచ్చింది సిపిఐనేనన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణా రాష్ట్రంలో 10 ఏండ్ల టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ ఒక్కరికి ఉద్యమ ఫలాలు అందలేదని, నేటి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఫలాలు పేదల దరిచేర్చేందుకు కృషి చేయాలని కోరారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గత పాలకులు అప్పుల రాష్ట్రంగా మార్చివేసి, ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలతో రూ.6లక్షల కోట్ల అప్పులను తెలంగాణ రాష్ట్ర పౌరుల మెడకు చుట్టినా పాలకులను గద్ద దించిన చరిత్ర రాష్ట్ర ప్రజలకు ఉందని తలిపారు. అమరవీరుల కలలను సాకారం చేయటం కోసం కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పోరాడి సాధించుకున్న తెలంగాణా రాష్ట్రంలో ఆ ఉద్యమ ఫలాలను ప్రజల దరిచేర్చే విధంగా ఉద్యమాలతో ప్రభుత్వాలపై వత్తిడి చేసే భాద్యతను సిపిఐ స్వీకరిస్తుందని స్పష్టం చేశారు. *ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు వీ పద్మజ ఇట్టి వెంకట్రావు నిమ్మల రాంబాబు, శానగరపు శ్రీనివాసరావు, చెన్నయ్య, ముత్యాల కిరణ్, గౌతమి కృష్ణ, వల్లపు యాకయ్య, ఆలపాటి ప్రసాద్, రామాచారి, సత్యనారాయణ, లావుడ్య చందూలాల్, చిల్ల కృష్ణ, ఆదినారాయణ, అల్లి వెంకటేశ్వర్లు, రామారావు, సంజీవరావు, వెంకటేశ్వర్లు, లాల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో పోటు కృష్ణమూర్తి విగ్రహం ఏర్పాటు చేయాలి

- కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.జె.కె. అహ్మద్



**పాల్వంచ విశాలభారతి:** తెలంగాణ తొలి ఉద్యమకారుడు పోటు కృష్ణమూర్తి విగ్రహాన్ని పాల్వంచలో ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.జె.కె. అహ్మద్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాల్వంచ పట్టణంలో పోటు కృష్ణమూర్తి సతీమణి పోటు లక్ష్మిని అహ్మద్ సన్మానించి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్.జె.కె. అహ్మద్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ చరిత్రలో పోటు కృష్ణమూర్తి పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కేటీపీఎస్ ప్రాంగణంలో ఆంధ్ర పెత్తందారుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా "గో బ్యాక్ ఆంధ్రా" అంటూ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నాయకుడు పోటు కృష్ణమూర్తి అని పేర్కొన్నారు. 1969 లో 14 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తెలంగాణ ఉద్యమానికి కొత్త ఊపిరి పోసారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకై పోటు కృష్ణమూర్తి చేసిన సేవలను ఉద్యమాన్ని స్మరింపజేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పాల్వంచలో స్థలాన్ని కేటాయించి పోటు కృష్ణమూర్తి విగ్రహ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అహ్మద్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో పోటు కృష్ణమూర్తి పోషించిన కీలక పాత్రను అధికారికంగా గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అక్బర్, జారే బిక్షం, ఆళ్ల రాఘవ, ఎస్.ఏ. నయుం, రామినాయుడు, ఆసిఫ్,పోటు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీకి మారుపేరు మా పార్టీ ప్రజా ప్రతినిధులు

**అసత్య ప్రచారాలతో ఒరిగేదేమీ లేదు .. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సూదిరెడ్డి గోపిరెడ్డి**



**అశ్వాపురం, విశాలభారతి :** అశ్వాపురం మండలంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ ద్వారా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారందరూ నిజాయితీకి మారుపేరని ఆ పార్టీ సీనియర్ నాయకులు సూది రెడ్డి కృష్ణారెడ్డి భీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి, రానున్న కాలంలో రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారం చేపట్టే దిశగా సైనికుల్లా పనిచేసే కార్యకర్త నుండి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారన్నారు. రాజకీయాలపై అవగాహన లేని కొందరు సామాజిక మధ్యలలో ప్రసారం చేసే చౌకబారు పనులు మానుకుంటే మంచిదన్నారు. గత మూడు నెలల క్రితం మండలానికి రాష్ట్ర మంత్రి వచ్చిన సందర్భంలో పంచాయితీలలో అధిక ఆర్థిక వ్యయంతో అభివృద్ధి చేపట్టే పనులకు నిధులు సమకూర్చుకునేందుకు సర్పంచులు మంత్రిని కలవడం జరిగిన మాట వాస్తవమే అన్నారు. ప్రభుత్వంలో ఉన్న మంత్రులను ప్రజాభివృద్ధి కోసం వివిధ హోదాలలో ఉన్న ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు కలిసి సమస్యలను వివరించడం సర్వసాధారణమని, అలా కలిసినంత మాత్రాన సర్పంచులు పార్టీలు మారతారని బురదజల్లే ప్రయత్నాలు మానుకుంటే మంచిదన్నారు. ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా ప్రతిపక్ష హోదాలో ఉన్నవారు అధికార హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులను కలుస్తున్నారంటే అది కేవలం స్థానికంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజాల అవసరాలు వారి సౌకర్యార్థాల కోసం నిధులు సమకూర్చే ప్రయత్నమే అన్నారు. నేడు రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి తీవ్రమైన ప్రజాధరణ లభిస్తోందని, రానున్న కాలంలో ప్రజలు కెసిఆర్ నాయకత్వానికి బ్రహ్మరథం పట్టడం ఖాయమని జోష్యం చెప్పారు. అది ప్రజలందరికి తెలిసిన విషయమేనని, ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితుల దృష్ట్యా ప్రజలు స్తబ్దతగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరడం అంటే చిల్లు పడిన నావలోకి ఎక్కడమే అని ఆయన ఎద్దేవా చేశారు. తమ పార్టీలో ఉన్న నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు నీతి నిబద్ధతతో పనిచేసే వారిని ఎవరెన్ని అసత్య ప్రచారాలు చేసినా ఉపయోగం లేదన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.